నేటినిజం నేటినిజం నేటినిజం నేటినిజం నేటినిజం నేటినిజం నేటినిజం నేటినిజం

**నేటి కందం- నేటికి అందం**

చిన్నతనంబున మొదలిడి
టెన్నీసున పట్టుబట్టి డింభకు దయ్యున్
ఎన్నో బహుమతులను గొని
యున్నతుడై నిలచినాడు యూకీ బాంబ్రీ !!

(31-1-2009 భారతీయుడైన యూకీ బాంబ్రీ ఆస్ట్రేలియా జూనియర్ ఓపెన్ టెన్నిస్ సాధించిన రోజు)

-రాధశ్రీ

సెల్:9494481210




# నేటి నిజం

తెలుగు దినపత్రిక

website2:www.netinijam.com2 ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433 E-mail : netinijam93@gmail.com

హైదరాబాద్ శుక్రవారం 31-1-2025 NETI NIZAM Telugu Daily, RNI No.52865/93· Postal No. HQ/SD/258/2024-2026 సంపుటి :31 సంచిక:137 పేజీలు:6 వెల: రూ.1/-


## విద్యార్థుల్లో పఠనా సంస్కృతి అలవర్చాలి..!

హైదరాబాద్, జనవరి 30:విద్యార్థుల్లో పఠన సంస్కృతి అలవర్చాలని ఇందాని కాంప్లెక్స్ సెక్రెటరీ నవీన్ అన్నారు. వాంకిడి ఎంపీపీఎస్ బెండారా, జడ్పీహెచ్ఎస్ ఇందాని, ఏహెచ్ఎస్ బంబార కాంప్లెక్స్ పరిధిలో 4, 5 వ తరగతి విద్యార్థులకు రూమ్ టూ రీడ్ సంస్థ అందించిన బ్లూ, ఎల్లో కలర్ పుస్తకాలలోని ఉన్న అంశాలపై పోటీలు నిర్వహించినట్లు తెలిపారు. ఈ పోటీల్లో తెలుగు విభాగంలో ఇందాని కాంప్లెక్స్ నుండి నాగోసే లక్ష్మి (ఎంపీపీఎస్ ఒడ్డర వాడ), బాంబార కాంప్లెక్స్ నుండి శివానీ (ఎంపీపిస్ సోనాపూర్), ఇంగ్లీష్ విభాగంలో ఇంధాని కాంప్లెక్స్ నుండి ఆకాశ్ (ఎంపిపిఎస్ లెండిగూడ), బాంబారా కాంప్లెక్స్ నుండి శివాని (ఎంపీపిస్ సోనాపూర్) విజేతలుగా నిలిచారు.

ప్రథమ స్థానం లో ఉన్న ఇద్దరు విద్యార్థులను జిల్లా స్థాయిలో పోటీలకు ఎంపిక చేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు శ్రీనివాస్, సంతోష్, రవి, సుశీల్, సాయి కుమార్, అజయ్, అరవింద్, శంభు, మహేందర్, సచిన్, వినోద్, క్లస్టర్ రిసోర్స్ పర్సన్ దుర్గం సందీప్ తదితరులు పాల్గొన్నారు.

# ఇంటి వద్దే ఇంటర్ హాల్‌టికెట్ల డౌన్‌లోడ్!

**-ఫోన్ నెంబర్లకు వెబ్ లింక్ పంపుతున్న బోర్డు**
**-ఈ ఏడాది నుంచి కొత్త ప్రయోగం**
**-సమస్య తలెత్తితే కళాశాలను సంప్రదించాలి**
**-మార్చి ఐదు నుంచి ప్రథమ ఇంటర్ పరీక్షలు**
**-మార్చి ఆరు నుంచి ద్వితీయ ఇంటర్ పరీక్షలు**

హైదరాబాద్, జనవరి 30:ఈ ఏడాది నుంచి ఇంటర్మీడియెట్ బోర్డు సరికొత్త ప్రయోగానికి శ్రీకారం చుట్టింది. విద్యార్థులకు సమయం వృథా కాకుండా ఇంటి వద్దే కూర్చొని ఇంటర్ హాల్ టికెట్లు డౌన్‌లోడ్ చేసుకునే విధంగా బోర్డు ఏర్పాట్లు చేసింది. విద్యార్థుల హాల్ టికెట్లను నేరుగా విద్యార్థులు ఇచ్చిన ఫోన్ నంబర్లకే పంపించనుంది. ఇప్పటికే ఇంటర్ మొదటి సంవత్సరం విద్యార్థులకు హాల్ టికెట్లు పంపించింది. త్వరలో రెండవ సంవత్సరం విద్యార్థులకు కూడా పంపనుంది.

ఒకవేళ సమస్య వస్తే కళాశాలను సంప్రదించాలి

విద్యా శాఖ పంపిన లింక్‌పై క్లిక్ చేసి హాల్ టికెట్‌ను డౌన్ లోడ్ చేసుకోవచ్చు. డౌన్‌లోడ్ చేసుకునేందుకు సమస్యలు తలెత్తితే కళాశాలను సంప్రదించాల్సి ఉంటుంది. గతంలో కాలేజీలకు హాల్ టికెట్లను పంపించేది. విద్యార్థులు తమ తమ కళాశాలలకు వెళ్లి హాల్ టికెట్లను తీసుకునేవారు. ఆ తర్వాత వెబ్‌సైట్‌లో పెట్టి డౌన్‌లోడ్ చేసుకోవాలనేవారు. ఇక మార్చి 5వ తేదీ నుంచి ఇంటర్మీడియట్ వార్షిక పరీక్షలు ప్రారంభంకానున్నాయి. రాష్ట్రవ్యాప్తంగా ఈ ఏడాది సుమారు 9.50 లక్షల మంది విద్యార్థులు ఈ పరీక్షలకు హాజరుకానున్నారు. ఈ పరీక్షలకు సంబంధించిన అన్ని ఏర్పాట్లను సమయానికి పూర్తి చేయాలని అధికారులను విద్యా శాఖ ఆదేశించింది.

విద్యార్థులకు ఊరట

ఈ విధానం ద్వారా ఇంటర్మీడియట్ విద్యార్థులకు పరీక్షల సమయంలో మరింత సౌకర్యం కల్పించడం జరుగుతోందని విద్యా శాఖ ప్రకటించండి. ఈ విధానం మొదటిసారి అమలు అవ్వడంతో, అధికారులు విద్యార్థుల మొబైల్ ఫోన్ నంబర్లు సేకరించారు. విద్యార్థులు ఇచ్చిన నంబర్లకు లింక్ పంపిస్తున్నారు. హాల్ టికెట్ల పంపిణీ విధానంలో వచ్చిన ఈ మార్పులు, విద్యార్థులకు సమయాన్ని ఆదా చేయడంతో పాటు, విద్యార్థులలో విశ్వాసం, సౌకర్యాన్ని పెంచుతుంది. ప్రైవేట్ కాలేజీలు పరీక్షల సమయాల్లో పెండింగ్ ఫీజులు పూర్తిగా కడితేనే హాల్ టికెట్లు అందజేస్తామంటూ బెదిరింపులకు పాల్పడకుండా.. ఈ విధానం విద్యార్థులకు పెద్ద ఊరట కలిగించనుంది.

**ప్రథమ ఇంటర్ పరీక్షల షెడ్యూల్ ఇదే**

5 మార్చి- సెకండ్ లాంగ్వేజ్ పేపర్-1
7 మార్చి - ఇంగ్లీష్ పేపర్-1
11 మార్చి - మాథ్స్ పేపర్ 1ఏ, బోటని పేపర్-1 , పొలిటికల్ సైన్స్ పేపర్-1
13 మార్చి - మ్యాథ్స్ పేపర్ 1బీ , జువాలజి పేపర్ -1, హిస్టరీ పేపర్-1
17 మార్చి- ఫిజిక్స్ పేపర్-1 , ఎకనామిక్స్ పేపర్-1
19 మార్చి - కెమిస్ట్రీ పేపర్-1 , కామర్స్ పేపర్-1
21 మార్చి - పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ పేపర్-1, బ్రిడ్జ్ కోర్స్ మ్యాథ్య పేపర్-1(బైపీసీ విద్యార్థులకు)
24 మార్చి - మోడ్రన్ లాంగ్వేజ్ పేపర్-1, జాగ్రఫీ పేపర్ -1

**ద్వితీయ ఇంటర్ పరీక్షల షెడ్యూల్ ఇదే**

6 మార్చి - సెకండ్ లాంగ్వేజ్ పేపర్-2
10 మార్చి - ఇంగ్లీష్ పేపర్-2
12 మార్చి - మాథ్స్ పేపర్ 2ఏ, బోటని పేపర్-2, పొలిటికల్ సైన్స్ పేపర్-2
15 మార్చి - మ్యాథ్స్ పేపర్-2బీ, జువాలజి పేపర్-2, హిస్టరీ పేపర్-2
18 మార్చి - ఫిజిక్స్ పేపర్-2, ఎకనామిక్స్ పేపర్-2
20 మార్చి - కెమిస్ట్రీ పేపర్-2, కామర్స్ పేపర్-2
22 మార్చి - పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ పేపర్-2, బ్రిడ్జ్ కోర్సు మ్యాథ్స్ 2(బైపీసీ విద్యార్థులకు)
25 మార్చి - మోడ్రన్ ల్యాంగ్వేజ్ పేపర్-2, జాగ్రఫీ పేపర్-2

# ఫిబ్రవరి 1న కేంద్ర బడ్జెట్.. ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ముందు సవాళ్లు..!

:బీటణవబి 2025-26 । వచ్చే ఆర్థిక సంవత్సర (2025-26) వార్షిక బడ్జెట్‌ను కేంద్ర ఆర్థికశాఖ మంత్రి నిర్మలాసీతారామన్ శనివారం పార్లమెంట్‌లో ప్రవేశపెట్టేందుకు సర్వం సిద్ధమైంది. ఆర్థిక మంత్రిగా నిర్మలా సీతారామన్ ప్రవేశ పెడుతున్న ఎనిమిదో బడ్జెట్ ఇది. బడ్జెట్ రూపకల్పనలో ఆర్థికశాఖ కార్యదర్శి తుహిన్ కాంతా పాండేతోపాటు కీలక అధికారులు అవిశ్రాంతంగా పని చేశారు. రూ.50 లక్షల కోట్లపై చిలుకు విలువ గల బడ్జెట్‌ను సిద్ధం చేశారు. అయితే పతనం అవుతున్న ఆర్థిక వృద్ధిరేటు, అమెరికా డాలర్‌పై రూపాయి మారకం విలువ పతనం, వినియోగ డిమాండ్‌లో పెరుగుదల వంటి పలు సవాళ్లను ఈ బడ్జెట్ పరిష్కరించాల్సి ఉంది.

ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2024-25)లో ఆర్థిక వృద్ధిరేటు నాలుగేండ్ల కనిష్టం 6.4శాతానికి పడిపోతుందని అంచనాలు వ్యక్తం అవుతున్నాయి. ఆర్థిక వృద్ధి రేటు నెమ్మదిస్తుందన్న సందేహాలు ఉన్నాయి. 2019-20లో యావత్ ప్రపంచాన్ని చిన్నాభిన్నం చేసిన కరోనా మహమ్మారి ప్రభావం తర్వాత అతి తక్కువ ఆర్థిక వృద్ధిరేటు నమోదు కావడం ఇదే తొలిసారి.

కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ వివిధ దశల్లో పలు సవాళ్ల నుంచి భారత ఆర్థిక వ్యవస్థను ముందుకు నడిపించారు. వినియోగం డిమాండ్‌లో మెరుగుదల, ఆర్థిక వృద్ధిరేట్ క్షీణత, భౌగోళిక రాజకీయ అనిశ్చితి, స్తంభించిన ప్రైవేట్ పెట్టుబడులు తదితర సమస్యల నుంచి ఆర్థిక వ్యవస్థను ముందుకు నడిపించారు. ఈ నెలలో ఫారెక్స్ మార్కెట్‌లో అమెరికా డాలర్‌పై రూపాయి మారకం విలువ జీవిత కాల గరిష్టం రూ.86.7లకు పతనమైంది. వచ్చే ఆర్థిక సంవత్సరం (2025-26) జీడీపీలో ద్రవ్యలోటు 4.5 శాతానికి దిగువకు తేవడం సర్కార్ లక్ష్యంగా ఉంది.

కేంద్ర వార్షిక బడ్జెట్ 2025-26 రూపకల్పనలో ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌కు రెవెన్యూ విభాగం కార్యదర్శి పాండే, ఆర్థిక వ్యవహారాల శాఖ కార్యదర్శి అజయ్ సేథ్, వ్యయాల కార్యదర్శి మనోజ్ గోవిల్, డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఇన్వెస్ట్‌మెంట్ అండ్ పబ్లిక్ అసెట్ మేనేజ్‌మెంట్ (దీపం) కార్యదర్శి అరుణిష్ చావ్లా, ఆర్థిక సేవల కార్యదర్శి ఎం నాగరాజు, ప్రధాన ఆర్థిక సలహాదారు వీ అనంత నాగేశ్వరన్ చేయూతనిచ్చారు.

# మిలటరీ హెలీకాప్టర్..విమానం ఢీ..68 మంది మృతి..

వాషింగ్టన్ జనవరి 30 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );: అమెరికాలోని వాషింగ్టన్‌లో కాన్సాస్ నుంచి ప్రయాణికులతో వస్తున్న పిఎస్ఏ ఎయిర్‌లైన్స్ విమానాన్ని శిక్షణలో ఉన్న మిలటరీ హెలీకాప్టర్ ఢీకొట్టడంతో రెండు నదిలో పడిపోయాయి. ఈ ప్రమాదంలో 64 మంది, హెలికాప్టర్ లో నలుగురు ఉన్నట్టు సమాచారం.జరిగిన విమాన ప్రమాద ఘటనలో ఇప్పటివరకు 18 మృతదేహాలు వెలికితీశారు. ప్రస్తుతం ఘటనాస్థలంలో సహాయక చర్యలు కొనసాగుతున్నాయి. ఘటనా జరిగిన వెంటనే అధికారులు, పోలీసులు, రెస్క్యూ సిబ్బంది సహాయక చర్యలు చేపట్టారు. ఈ ప్రమాదంలో అందరూ చనిపోయినట్లు తెలుస్తోంది.మృతదేహాల కోసం వెలికితీసేందుకు అధికారులు తీవ్రంగా శ్రమిస్తున్నారు

# మహాకుంభమేళాలో మరోసారి భారీ అగ్నిప్రమాదం

**– సెక్టార్ 22లో చెలరేగిన మంటలు.. తగలబడిన టెంట్లు**

ప్రయాగ్‌రాజ్ జనవరి 30 (ఎక్స్ ప్రెస్ న్యూస్);మహాకుంభమేళాలో మరోసారి భారీ అగ్నిప్రమాదం జరిగింది. సెక్టార్ 22లో మంటలు చెలరేగాయి. దీంతో పెద్ద ఎత్తున మంటలు వ్యాపిస్తుండటంతో టెంట్లు తగలబడ్డాయి. వెంటనే అప్రమత్తమైన అగ్ని మాపక సిబ్బంది.. ఫైర్ ఇంజిన్లతో మంటలు అదుపుచేస్తున్నారు. ఈ ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది. ఇంతకుముందు కూడా అగ్నిప్రమాదం జరిగింది. ఈ ఘటనలో పలు గుడారాలు దగ్ధమయ్యాయి.కాగా, నిన్ననే కుంభమేళాలో తొక్కిసలాట జరిగిన సంగతి తెలిసిందే. ఇంతలోనే మరోసారి అగ్ని ప్రమాదం జరగడం చర్చనీ యాంశంగా మారింది. తొక్కిసలాట ఘటనలో ఇప్పటికే 30 మంది మరణించినట్లు అధికారులు తెలిపారు. మరో 60 మందికి పైగా తీవ్రంగా గాయపడ్డారు. ప్రస్తుతం వారంతా ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్నారు. అయితే, పలువురి పరిస్థితి విషమంగా ఉండటంతో మృతుల సంఖ్య పెరిగే అవకాశం ఉందని తెలుస్తోంది.

# సభ్యులు ఆందోళన మధ్య రూ. 8,440 కోట్ల బడ్జెట్‌కు జిహెచ్ఎంసి కౌన్సిల్ ఆమోదం

హైదరాబాద్ జనవరి (ఎక్స్ ప్రెస్ న్యూస్);: జిహెచ్ఎంసి కౌన్సిల్ సమావేశం ప్రారంభంకాగానే క్వశ్చన్ అవర్ చేపట్టాలని బిఆర్ఎస్ సభ్యులు ఆందోళన చేపట్టడంతో రసభాసంగా మారింది. గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ లో బడ్జెట్ పై జిహెచ్ఎంసి కౌన్సిల్ ఆమోదం తెలిపింది. బిఆర్ఎస్ కార్పొరేటర్లు మేయర్ పోడియం చుట్టుముట్టి కాగితాలు చించి విజయలక్ష్మిపై విసిరేశారు. మేయర్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేస్తున్న బిఆర్ఎస్ కార్పొరేటర్లను మార్షల్స్ అడ్డుకున్నారు. బిఆర్ఎస్ కార్పొరేటర్లను మేయర్ విజయలక్ష్మి సస్పెండ్ చేశారు. మేయర్ గద్వాల విజయలక్ష్మి అధ్యక్షతన కౌన్సిల్ సమావేశం జరిగింది. ఈ నేపథ్యంలో శుక్రవారం మేయర్ గద్వాల విజయలక్ష్మి 2025- 26 ఆర్థిక సంవత్సరానికి గాను పద్దు ప్రవేశపెట్టనున్నారు. రూ. 8,440 కోట్ల బడ్జెట్ కు జిహెచ్ఎంసి కౌన్సిల్ ఆమోదం తెలిపింది. రేపు బడ్జెట్ పై చర్చలు జరుపనున్నారు.

# డిజిటల్ మీడియాకు సైతం ప్రభుత్వ ప్రకటనలు ఇవ్వాలి



హైదరాబాద్, జనవరి 30: ప్రతిక్షణం ప్రజలకు సమాచారాన్ని చేరవేస్తున్న ఆన్‌లైన్ న్యూస్ మీడియా(వెబ్‌సైట్, యాప్)కు ప్రభుత్వ ప్రకటనలు ఇవ్వాలని తెలంగాణ డిజిటల్ మీడియా జర్నలిస్ట్ అసోసియేషన్ నాయకులు స్వామి ముద్దం, పోతు అశోక్ అన్నారు. ఈ మేరకు తెలంగాణ సమాచార, పౌర సంబంధాల శాఖ ప్రత్యేక కమిషనర్ ఎస్ హరీష్‌కు వినతి పత్రం అందజేశారు. దీనిపై సానుకూలంగా స్పందించిన కమిషనర్..త్వరలోనే ఆన్‌లైన్ మీడియాకు ప్రభుత్వ ప్రకటనలు ఇచ్చే ప్రక్రియను ప్రారంభిస్తామని హామీ ఇచ్చారు.

ఇందుకు సంబంధించిన గైడ్ లైన్స్ రూపొందిస్తామని చెప్పారు. ఈ సందర్భంగా జర్నలిస్టు నాయకులు స్వామి ముద్దం మాట్లాడుతూ.. ప్రభుత్వానికి, ప్రజలకు మధ్య వారధిగా డిజిటల్ మీడియా రంగం కీలక పాత్ర వహిస్తుందన్నారు. ఈ కొత్త మాధ్యమంలో అనేక మంది జర్నలిస్టలు పని చేస్తున్నారని చెప్పారు. కమిషనర్ సానుకూలంగా స్పందించి ప్రక్రియ ప్రారంభిస్తామని చెప్పడం సంతోషంగా ఉందన్నారు. హరీష్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

# సిమెంట్ ఫ్యాక్టరీ ప్లాంట్ స్లాబ్ కుప్పకూలడంతో ఇద్దరు మృతి



భోపాల్ జనవరి 30 (ఎక్స్ ప్రెస్ న్యూస్);సిమెంట్ ఫ్యాక్టరీ ప్లాంట్ స్లాబ్ కుప్పకూలడంతో ఇద్దరు మృతి చెందారు. ఈ విషాద ఘటన మధ్యప్రదేశ్‌లో చోటుచేసుకుంది. పన్నా జిల్లాలోని జేకే సిమెంట్ ఫ్యాక్టరీ ప్లాంట్‌లోని యూనిట్‌లో ఓ నిర్మాణం కూలిపోవడంతో ఇద్దరు కార్మికులు మృతి చెందగా, 50 మందికి పైగా గాయపడ్డారు. తీవ్రంగా గాయపడిన వారిని వైద్య చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం.. నిర్మాణంలో ఉన్న ప్లాంట్‌లోని ఒక విభాగంలో సీలింగ్ స్లాబ్‌ను ఏర్పాటు చేస్తున్నారు.ఈ సమయంలో పలువురు కార్మికులపై సెంటర్ ప్రాంతం కూలిపోయింది. దీంతో శిథిలాల క్రింద చిక్కుకున్న కార్మికులను రక్షించేందుకు పోలీసులు, రెస్క్యూ సిబ్బంది సహాయక చర్యలు చేపట్టారు. పలువురు బయటకు తీసుకొచ్చి చికిత్స కోసం ఆస్పత్రికి తరలించారు. కాగా, ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసుకుని విచారణ చేపట్టారు. మృతుల సంఖ్య పెరిగే అవకాశం ఉన్నట్లు పోలీసులు తెలిపారు.

# శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయానికి బాంబు బెదిరింపు

శంషాబాద్ జనవరి 30 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయానికి బాంబు బెదిరింపులు కలకలం రేపాయి. గురువారం ఉదయం ఎయిర్‌పోర్ట్‌కు బాంబు బెదిరింపులు వచ్చాయి. సైబరాబాద్ కంట్రోల్‌రూమ్‌కు ఓ ఆగంతకుడుకు ఫోన్ చేసి బెదిరించాడు. దీంతోప్రమత్తమైన ఎయిర్ పోర్ట్ సెక్యూరిటీ.. ముమ్మర తనిఖీలు చేశారు.అయితే, ఎలాంటి అనుమానాస్పద వస్తువులు లభించకపోవడంతో బాంబు బెదిరిం పు కాల్ ఫేక్ అని ఎయిర్ పోర్ట్ అధికారులు తేల్చారు. బెదిరింపు కాల్ చేసిన వ్యక్తి తెలంగాణలోని కామారెడ్డి వాసిగా గుర్తించిన అధికారులు.. అతడికి మతిస్థిమితం లేదని నిర్ధారించారు. ఇటీవల కూడా శంషాబాద్ ఎయిర్ పోర్టుతోపాటు దేశవ్యాప్తంగా పలు విమానాలకు బాంబు బెదిరింపలు వచ్చిన సంగతి తెలిసిందే.

# ఒడిశా ప్రభుత్వం కీలక నిర్ణయం.. ఫిబ్రవరి 4 వరకు కుంభమేళాకు బస్సులు రద్దు



భువనేశ్వర్, జనవరి 30: ఒడిశా ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకున్నది. మహా కుంభమేళా కోసం ఏర్పాటు చేసిన ప్రత్యేక బస్సు సర్వీసులను ఫిబ్రవరి 4 వరకు రద్దు చేసింది. అనివార్య పరిస్థితుల కారణంగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఒక ఉత్తర్వులో పేర్కొంది. మహా కుంభమేళా, అయోధ్యకు వెళ్లే ప్రయాణికుల కోసం ఏర్పాటు చేసిన ప్రత్యేక బస్సు సర్వీసులను ఫిబ్రవరి 4 వరకు తక్షణమే రద్దు చేస్తున్నట్లు ఒడిశా ఆర్టీసీ తెలిపింది. తాజా అప్‌డేట్‌ను అధికారిక వెబ్‌సైట్, సోషల్ మీడియాలో సమాచారం ఇస్తామని పేర్కొంది. ఈ మేరకు గురువారం ఒక నోటీస్‌ను జారీ చేసింది. అయితే ఫిబ్రవరి 26 వరకు మహా కుంభమేళాకు ప్రత్యేక బస్సు సర్వీసులు నిర్వహించాలని గతంలో నిర్ణయించింది.

కాగా, ఉత్తరప్రదేశ్‌లోని ప్రయాగ్‌రాజ్‌లో జరుగుతున్న మహా కుంభమేళాకు భక్తులు పోటెత్తుతున్నారు. అయితే మౌని అమావాస్య సందర్భంగా త్రివేణి సంగమం వద్ద తోపులాట జరిగింది. ఈ సంఘటనలో 30 మంది భక్తులు మరణించారు. 60 మందికిపైగా గాయపడ్డారు. పలువురి జాడ కనిపించడంలేదు. అలాగే అగ్నిప్రమాదాలు వంటి సంఘటనలు జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో ఒడిశా ప్రభుత్వం అప్రమత్తమైంది. ఆ రాష్ట్రం నుంచి భక్తుల రద్దీని తగ్గించేందుకు మహా కుంభమేళాకు ఏర్పాటు చేసిన ప్రత్యేక బస్సు సర్వీసులను తాత్కాలికంగా రద్దు చేసింది.

# అత్యాచారం కేసులో కాంగ్రెస్ ఎంపీ అరెస్టు



లక్నో జనవరి 30 (ఎక్స్ ప్రెస్ న్యూస్ ); : కాంగ్రెస్ ఎంపీ రాకేశ్ రాథోడ్‌ను యూపీ పోలీసులు అరెస్టు చేశారు. సీతాపూర్ ఎంపీగా ఉన్న ఆయనపై అత్యాచార ఆరోపణలపై కేసు నమోదు కావడంతో అదుపు లోకి తీసుకున్నారు. సీతాపూర్ లోని తన నివాసంలో మీడియాతో మాట్లాడుతుండగానే ఆయనను అరెస్టు చేసినట్టు సమాచారం. భారీ పోలీస్ భద్రత నడుమ ఆయనను కోర్టుకు తీసుకెళ్లారు. తనను పెళ్లి చేసుకుంటానని నమ్మించి నాలుగేళ్లుగా తనపై అత్యాచారానికి పాల్పడినట్టు ఆరోపిస్తూ ఓ మహిళ జనవరి 17 న పోలీసులకు ఫిర్యాదు చేశారు. తనతో మాట్లాడిన కాల్ రికార్డింగ్స్‌ను సైతం పోలీసులకు సమర్పించారు. దీంతో పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ క్రమంలో బుధవారం ఉదయమే ఎంపీ రాథోడ్ అలహాబాద్ హైకోర్టు లఖ్‌నవూ బెంచ్‌లో ముందస్తు బెయిల్ పిటిషన్ వేయగా, న్యాయస్థానం తిరస్కరించింది. రెండు వారాల్లోగా సెషన్స్ కోర్టులో లొంగిపోవాలని సూచించినట్టు సమాచారం. అంతకు ముందు ఇదే కేసులో ఎంపీ, ఎమ్ఎల్ఏ కోర్టులో ముందస్తు బెయిల్ పిటిషన్ వేసినా తిరస్కరణకు గురైంది. ఈ నేపథ్యంలో గురువారం ఆయన నివాసం వద్దకు భారీ బందోబస్తుతో వెళ్లిన పోలీసులు అదుపు లోకి తీసుకున్నారు.

# వెంటనే రూ.5 వేల కోట్లు ఫీజు రీయింబర్స్‌మెంట్ చెల్లించాలి

**– బిజెపి ఎంపి ఈటల రాజేందర్ డిమాండ్**

హైదరాబాద్ జనవరి 30 (ఎక్స్ ప్రెస్ న్యూస్ ); కాంగ్రెస్ ప్రభుత్వంపై బిజెపి ఎంపి ఈటల రాజేందర్ తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. . వెంటనే రూ.5 వేల కోట్లు రిలీజ్ చేసి ఫీజు రీయింబర్స్‌మెంట్ చెల్లించాలని ఆయన డిమాండ్ చేశారు.

సర్కార్ తీరుతో విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు తెలిపారు. ఇందిరాపార్కు ధర్నా చౌక్ వద్ద బీసీ విద్యార్థుల సమర శంఖారావం కార్యక్రమం నిర్వహించారు. విద్యార్థుల సమావేశానికి ఎంపి ఈటల రాజేందర్ హాజరై మద్దతు తెలిపారు. ఫీజులు చెల్లించలేక, సర్టిఫికెట్లు రాక విద్యార్థులు ఇబ్బందిపడుతున్నారని చెప్పారు. రాష్ట్రంలో 14 లక్షల కుటుంబాల్లో శాంతి లేకుండా చేస్తున్నారని రేవంత్ రెడ్డి ప్రభుత్వంపై మండిపడ్డారువిద్యార్థుల సమస్యల పరిష్కారానికి బీజేపీ ఎప్పుడూ ముందుంటుందని ఈటల చెప్పారు.

# మహా కుంభమేళాలో తొక్కిసలాట.. సుప్రీం కోర్టులో పిటిషన్

న్యూఢిల్లీ జనవరి 30 (ఎక్స్ ప్రెస్ న్యూస్ ); : ప్రయాగ్‌రాజ్‌లో జరుగుతున్న మహాకుంభమేళాలో మౌని అమావాస్య సందర్భంగా భారీగా భక్తులు తరలిరావడంతో తొక్కిసలాట జరిగి 30 మంది ప్రాణాలు కోల్పోయిన సంగతి తెలిసిందే. ఈ సంఘటనపై ఉత్తరప్రదేశ్ బాధ్యత వహించాలంటూ తాజా గా సుప్రీం కోర్టులో పిటిషన్ దాఖలైం ది. విశాల్ తివారీ అనే న్యాయవాది ఈ వ్యాజ్యాన్ని వేశారు. భవిష్యత్తులో ఇలాంటి దుర్ఘటనలు జరుగకుండా రాష్ట్రాలకు స్పష్టమైన విధానపరమైన మార్గదర్శకాలు ఇవ్వాలని అందులోకో రారు. భక్తుల భద్రత ప్రమాదంలో పడకుండా నివారించేలా విఐపీల కదలికలు ఆపాలని పిటిషన్‌లో ప్రస్తావించారు. ఈ వ్యాఖ్యలు నేపథ్యంలో తొక్కిసలాటపై యూపీ ప్రభుత్వం స్టేటస్ రిపోర్టును సమర్పించాల్సి ఉంటుంది.

# లేబర్ కోర్ట్ 111 అంతర్గత కమిటీ ఛైర్మెన్ గా కె.ఎల్.జ్యోతి నియామకం

హైదరాబాద్, జనవరి 30(ఎక్స్ ప్రెస్ న్యూస్ );పని ప్రదేశంలో మహిళల పై లైంగిక వేధింపుల (నివారణ, నిషేధం మరియు పరిహారం) 4(1) మరియు చట్టం (2) 2013లో పేర్కొన్న సెక్షన్ సంబంధించి, నియంత్రణలో పని చేస్తున్న 111 హైదరాబాద్ ప్రిసైడింగ్ ఆఫీసర్ లేబర్ కోర్టని కార్యాలయంలో కింది అంతర్గత కమిటీని కె. ఎల్. జ్యోతిని ఛైర్మెన్ నియమిస్తూ లేబర్ కోర్టు 111 ప్రిసైడింగ్ ఆఫీసర్ జి. వి.ఎన్. భాగ్యలక్ష్మి ఉత్తర్వులు జారీ చేశారు.

పేద ప్రజల మధ్యలో అనేక ప్రాంతాలల్లో సామాజిక కార్యక్రమాలను నిర్వహిస్తు పలు స్వచ్ఛంద సంస్థలకు నేతృత్వం వహిస్తున్న కె. ఎల్.జ్యోతి కార్మిక, ఉపాధి, శిక్షణ మరియు ఫ్యాక్టరీల శాఖ తెలంగాణ సచివాలయం ద్వారా ఉత్తర్వులు జారి ఐనాయి.. కె.ఎల్.జ్యోతి మూడు సంవత్సరాల పాటు ఈపదవిలో కొనసాగుతారు.

# జీబ్రాల జాతి అంతరించిపోతున్నదా !

## (31 జనవరి "అంతర్జాతీయ జీబ్రాల దినం" సందర్భంగా)

జీవజాతుల్లో ప్రతి జీవికి ఒక ప్రాధాన్యం ఉంటుంది. జీవ వైవిధ్య పరిరక్షణలో అన్ని జీవులు తమ తమ పాత్రను నిర్వహిస్తాయి. భూగోళంపై 8 మిలియన్లకు పైగా వృక్షజంతు జీవరాసులు ఉండవచ్చని, వాటిలో దాదాపు 2 మిలియన్లను జీవరాశులను శాస్త్రజ్ఞులు గుర్తించారని తెలుస్తున్నది. జంతుశాస్త్ర జాబితాలో ఉన్న అత్యల్ప సూక్ష్మజీవుల నుంచి అతి పెద్ద బ్లూ వేల్ వరకు అన్ని జంతువులకు ఒక్కో ప్రత్యేకత ఉన్నది. మానవ తప్పిదాలతో ఈ జీవుల మనుగడకు వందల ఏండ్లు విఘాతం కలిగితే వాటి సంఖ్య క్రమంగా తగ్గుతూ చివరకు అంతరించిపోయిన జంతువుల జాబితాలోకి చేరతాయి. ఇలా ఇప్పటి వరకు అంతరించి పోయిన జీవుల సంఖ్య వేలల్లో ఉండవచ్చని, నేటికీ దాదాపు 905 జీవులు అంతరించిపోవడం జరిగిందని రుజువు చేయబడింది. మరి కొన్ని అరుదైన జీవజాతులు అంతరించడానికి ఎంతో సమయం పట్టదని కూడా హెచ్చరిస్తున్నారు. జీవజాతులు అంతరిస్తూ పోతే, జీవ వైవిధ్యం దెబ్బతిని చివరికి మనిషి మనుగడ కూడా ప్రశ్నార్థకంగా కావడంతో పాటు, మనిషి జాతి కూడా అంతరించే అవకాశాలు లేకపోలేదు. ఆఫ్రికా దేశాల్లో కనిపించే ఒక ప్రత్యేక జంతువులుగా జీబ్రాలకు పేరుంది. నేటి ఆధునిక మానవుడి అతి తెలివితో జీబ్రాల సంఖ్య కూడా క్రమంగా తగ్గుతున్నట్లు, ఒక రకమైన జీబ్రాలు అంతరించే దుస్థితికి చేరాయని జంతు ప్రేమికులు, శాస్త్రవేత్తలు హెచ్చరికలు చేస్తున్నారు.

### ఆఫ్రికా దేశాల్లో కనిపించే విలక్షణ జీబ్రాలు:

రోడ్ల వెంట జీబ్రా క్రాసింగ్స్ ఉండడం మనం చూసాం. జీబ్రా జాతులను కాపాడుకోవడానికి చేస్తున్న ప్రయత్నాల్లో భాగంగా ప్రతి ఏట 31 జనవరి రోజున "అంతర్జాతీయ జీబ్రాల దినం" పాటించుట జరుగుతున్నది. అంతర్జాతీయ జీబ్రాల దినం–2025 ఇతివృత్తంగా "ఏ ఫ్యూచర్ విత్ స్ట్రైప్స్" (చారలతో భవిష్యత్తు) అనబడే అంశాన్ని తీసుకున్నారు. భూగోళంపై ఉన్న విలక్షణ జంతువులుగా జీబ్రాలను గుర్తించారు. నలుపు, తెలుపు చారతో ప్రత్యేకంగా కనిపించే జీబ్రాలు గడ్డి మేస్తూ అటవీ పర్వత ప్రాంతాల్లో నివసిస్తుంటాయి. కెన్యా, నమీబియా, అంగోలా, దక్షిణ ఆఫ్రికా దేశాల్లో కనిపించే జీబ్రాల సంఖ్య మానవ తప్పిదాలతో క్రమంగా తగ్గుతున్నట్లు గమనించారు. మానవ ప్రమేయంతో జీబ్రాల నివాస ప్రాంతాలను అక్రమించడం, మాంసం/చర్మం కోసం వేట చేయడం, జంతువుల మధ్య మనుగడ పోటీ పెరగడం, జీబ్రాల సంచరించే దారులను మూసి వేయడం, కొన్ని ప్రాంతాల్లో యుద్ధ వాతావరణాలు నెలకొనడం, అవగాహన లోపం లాంటి కారణాలతో వాటి సంఖ్య తరుగుతోంది. ఇప్పటికే 'ఖ్వగ్గా' అనబడే జీబ్రా జాతి 19వ శతాబ్దంలోనే అంతరించింది. నేడు మైదాన ప్రాంత, పర్వత ప్రాంత, గ్రేవీ అనే మూడు రకాల జీబ్రా జాతులు కనిపిస్తున్నాయి. వీటిలో పెద్దగా కనిపించే గ్రేవీ జాతి జీబ్రాలు అంతరించే అంచున ఉన్నట్లు అధ్యయనాలు తెలియజేస్తున్నాయి.

### జీబ్రాల ప్రత్యేక లక్షణాలు:

నలుపు, తెలుపు చారలు కలిగిన జీబ్రాలు విలక్షణంగా కనిపిస్తూ తమ ప్రత్యేకతలను ప్రదర్శిస్తాయి. ఒక్కో జీబ్రా చారలు ఒక్కో రకంగా మానవ హస్త రేఖల వలె ఉండడం విశేషం. ఈ చారల సహాయంతోనే అడవిల్లో తమ వెంటపడే సింహాలు, హైనాలు లాంటి మాంసాహార జంతువులకు కనబడకుండా తప్పించుకోగలుగుతున్నాయి. జీబ్రాలు గంటకు 65 కిమీ దూరం ప్రయాణించగలవు. ఇవి అటవీ ప్రాంతాల్లో గుంపులుగా జీవిస్తూ, గడ్డిని తింటూ విత్తనాలను ఇతర ప్రాంతాలకు వెదజల్లుతూ జీవ వ్యవస్థ ఆరోగ్యానికి దోహదపడుతున్నాయి.

అంతర్జాతీయ జీబ్రాల దినం వేదికగా జీబ్రాల సంరక్షణ చర్యలు, వాటి ప్రాధాన్యం, జీవ వైవిధ్య అవసరాన్ని వివరించడం, జీబ్రా చారలు కలిగిన వస్త్రాలు ధరించడం, వేటల నిషేధ చట్టాలను పటిష్టంగా అమలు పరచడం, విద్యాలయాల్లో పోటీల నిర్వహణ, సామాజిక మాధ్యమాల్లో ప్రచారాలు లాంటి కార్యక్రమాలు నిర్వహించడం సముచితంగా ఉంటుంది. జీబ్రా జాతులు మనుగడ కొనసాగే విధంగా ప్రపంచ మానవాళి కృషి చేయాలని కోరుకుందాం.

–డా।।బుర్ర మధుసూదన్ రెడ్డి
9949700037

# ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ చేతులమీదుగా డెహ్రాడూన్‌లో 38వ జాతీయ క్రీడలు ప్రారంభం

న్యూఢిల్లీ, జనవరి 30:ఉత్తరాఖండ్‌లోని డెహ్రాడూన్‌లో 38వ జాతీయ క్రీడలను ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ ఈ రోజు ప్రారంభించారు. ఈ సందర్భంగా సభికులను ఉద్దేశించి ఆయన ప్రసంగిస్తూ, ఉత్తరాఖండ్ లో ఈ రోజు యువ శక్తి పొంగిపొరలుతోందంటూ అభివర్ణించారు. బాబా కేదార్‌నాథ్, బద్రీనాథ్, గంగ మాతల ఆశీర్వాదాలతో 38వ జాతీయ క్రీడలు ఈ రోజు నుంచి మొదలవుతున్నాయని ఆయన అన్నారు. ఉత్తరాఖండ్ ఆవిర్భవించి ఇప్పటికి ఇది 25వ సంవత్సరం అని శ్రీ మోదీ ప్రధానంగా చెబుతూ, ఈ యువ రాష్ట్రంలో దేశం నలుమూలల నుంచి వచ్చిన యువత తన ప్రతిభను చాటిచెప్పనుందని వ్యాఖ్యానించారు. ఈ కార్యక్రమం 'ఏక్ భారత్, శ్రేష్ఠ భారత్' సుందర చిత్రాన్ని ఆవిష్కరించిందని కూడా ఆయన ప్రశంసించారు. జాతీయ క్రీడల తాజా సంచికలో అనేక స్థానిక ఆటలను చేర్చారనీ, 'హరిత క్రీడలు' ఈ ఆటలపోటీకి ఇతివృత్తంగా ఉందనీ ఆయన చెప్పారు. ఈ ఇతివృత్తం గురించి ప్రధాని మరింతగా వివరిస్తూ, ఈ పోటీల సందర్భంగా ప్రదానం చేసే ట్రోఫీలు, పతకాలను ఎలక్ట్రానిక్ వ్యర్థాల (ఈ–వేస్ట్)తో తయారు చేశారనీ, పతకాన్ని గెలిచే ప్రతి ఒక్క విజేత పేరుతో ఒక మొక్కను నాటనున్నారనీ ఆయన వెల్లడిస్తూ ఇది ఒక గొప్ప కార్యక్రమమని కొనియాడారు.

ఈ నేషనల్ గేమ్స్‌లో పాల్గొనే క్రీడాకారులు, క్రీడాకారిణులూ అందరికీ ఆయన తన శుభాకాంక్షలను తెలియజేశారు. ఇంత గొప్ప కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నందుకు ఉత్తరాఖండ్ ప్రభుత్వానికీ, ఉత్తరాఖండ్ ప్రజలకూ కూడా ఆయన అభినందనలు తెలిపారు.

బంగారాన్ని పుటం పెట్టినందువల్ల అది శుద్ధం అయినట్లే, క్రీడాకారులకు, క్రీడాకారిణులకు వారి శక్తిని పెంపొందింపచేసుకోవడానికి మరిన్ని అవకాశాలను ఇస్తున్నారని ప్రధానమంత్రి పోలికగా చెప్పారు. ప్రస్తుతం సంవత్సర కాలంలో అనేక ఆటల పోటీలను నిర్వహిస్తున్నారనీ, ఖేలో ఇండియా శ్రేణిలో అనేక కొత్త టోర్నమెంట్‌లను చేర్చారనీ ఆయన వెల్లడించారు. ఖేలో ఇండియా యూత్ గేమ్స్ అనేక మంది యువ క్రీడాకారులకు, యువ క్రీడాకారిణులకు వారి బాటలో ముందుకు సాగిపోవడానికి అనేక అవకాశాలను అందించిందనీ, ఇక యూనివర్సిటీ గేమ్స్ విశ్వవిద్యాలయాల విద్యార్థులకు చాలా అవకాశాలను ప్రసాదిస్తోందనీ శ్రీ మోదీ స్పష్టం చేశారు. దివ్యాంగ క్రీడాకారులు, దివ్యాంగ క్రీడాకారిణులు వారి ఆటతీరుకు మెరుగులు పెట్టుకోవడానికీ, కొత్త కొత్త విజయాలను చేజిక్కించుకోవడానికీ ఖేలో ఇండియా పారా గేమ్స్ తోడ్పడ్డాయని ఆయన అన్నారు. ఖేలో ఇండియా శీతాకాల క్రీడలు ఇటీవల లద్దాఖ్‌లో మొదలయ్యాయి, కిందటి ఏడాదిలో సముద్ర తీర క్రీడలనూ నిర్వహించారు అని ప్రధానమంత్రి గుర్తుకు తెచ్చారు.

క్రీడలను ప్రోత్సహించడానికి చేపట్టే ప్రయత్నాలకు ఒక్క ప్రభుత్వానిదే బాధ్యతగా లేదనీ, కొత్త ప్రతిభావంతులను తెర ముందుకు తీసుకురావడం కోసం పార్లమెంట్ సభ్యుల్లో చాలా మంది వారి వారి నియోజకవర్గాల్లో క్రీడా పోటీలను నిర్వహిస్తున్నారని శ్రీ మోదీ తెలిపారు. కాశీ పార్లమెంటరీ నియోజకవర్గానికి సభ్యునిగా ఉన్న శ్రీ మోదీ ఒక్క తన పార్లమెంటరీ నియోజకవర్గంలోనే దాదాపుగా రెండున్నర లక్షల మంది యువత ఏటా ఆటల పోటీలలో పాల్గొనే అవకాశాలను అందుకొంటున్నారన్నారు. దేశంలో క్రీడలను ఒక సుందరమైన పుష్పగుచ్ఛంగా తీర్చిదిద్దుతున్నారనీ, పూలు ప్రతి కాలంలో పూస్తూ ఉన్న విధంగానే ఆటల పోటీలను నిరంతరాయంగా నిర్వహిస్తూ వస్తున్నారనీ ఆయన అభివర్ణించారు.

"భారత సమగ్రాభివృద్ధికి ఒక కీలక మాధ్యమంగా క్రీడలను లెక్కల్లోకి తీసుకొంటున్నార"ని ప్రధానమంత్రి వ్యాఖ్యానించారు. ఒక దేశం క్రీడల్లో రాణించిందంటే దాని పేరు ప్రఖ్యాతులు కూడా పెరుగుతాయన్నారు. ఈ కారణంగా, క్రీడలను భారతదేశ అభివృద్ధితోనూ, దేశ యువతలో విశ్వాసం స్థాయిలతోనూ పెనవేస్తున్నారని ప్రధాని అన్నారు. మన దేశం ప్రపంచంలో మూడో అతి పెద్ద ఆర్థిక శక్తిగా మారే దిశలో వేగంగా పయనిస్తోందనీ, ఈ కృషిలో క్రీడాప్రధాన ఆర్థిక వ్యవస్థ ముఖ్య పాత్రను పోషిస్తోందనీ ఆయన ప్రధానంగా చెప్పారు. ప్రతి ఒక్క క్రీడాకారుడు, క్రీడాకారిణి వెనుక కోచ్‌లు, శిక్షకులు, పోషణ నిపుణులు, దేహదారుఢ్య విషయాల ప్రవీణులు, వైద్యులు, క్రీడాసామగ్రి ల వంటి విస్తారిత అనుబంధ వ్యవస్థ (ఇకోసిస్టమ్) దన్నుగా నిలుస్తోందని ఆయన అన్నారు. ప్రపంచమంతటా క్రీడాకారులు ఉపయోగిస్తున్న నాణ్యత కలిగిన క్రీడా పరికరాల తయారీదారుగా భారత్ రూపొందుతోందని శ్రీ మోదీ చెప్పారు. క్రీడాసాధన సామగ్రిని తయారు చేస్తున్న చిన్నా, పెద్దా ఫ్యాక్టరీలు కలుపుకొని 35,000కు పైగా మేరఠ్‌లో ఏర్పాటయ్యాయనీ, అవి 3 లక్షల కన్నా ఎక్కువ మందికి బతుకుతెరువును కల్పిస్తున్నాయనీ ఆయన వివరించారు. ఈ తరహా విస్తారిత అనుబంధ వ్యవస్థలను దేశం అంతటా ఏర్పాటు చేస్తున్నారని ఆయన స్పష్టం చేశారు.

భారతదేశం పక్షాన ఒలింపిక్స్‌లో పాల్గొన్న క్రీడాకారుల బృందాన్ని ఈమధ్యే ఢిల్లీలో తన నివాసంలో కలుసుకొనే అవకాశం తనకు లభించిందని ప్రధానమంత్రి చెబుతూ, ఆ సందర్భంగా తమ మధ్య జరిగిన సంభాషణల్లో క్రీడాకారుల్లో ఒకరు తనను ప్రధానమంత్రి గా కాకుండా 'పరం మిత్ర' అని సరికొత్త నిర్వచనాన్ని చెప్పారని గుర్తుచేసుకొన్నారు. ఈ నమ్మకమే తనలో శక్తిని నింపుతుందని ఆయన అన్నారు. మన క్రీడాకారుల ప్రతిభ, సామర్థ్యాలపై తనకు పూర్తి నమ్మకం ఉందని ఆయన స్పష్టం చేశారు. గత పది సంవత్సరాల్లో వారి ప్రతిభకు అండదండలను అందించడంపై అదే పనిగా శ్రద్ధ తీసుకొంటున్నట్లు, గడచిన దశాబ్ద కాలంలో క్రీడలకు కేటాయించిన బడ్జెట్ మూడింతల కన్నా ఎక్కువగా ఉందని ప్రధాని వివరించారు. టీఓపీఎస్ పథకంలో భాగంగా, డజన్ల కొద్దీ క్రీడాకారులకు కోట్లాది రూపాయల విలువైన సాయాన్ని అందిస్తున్నామని ఆయన తెలిపారు. ఖేలో ఇండియా కార్యక్రమం దేశం నలుమూలలా ఆధునిక క్రీడా సంబంధ మౌలిక వసతి, సదుపాయాలను సమకూరుస్తోందని ఆయన ఉద్ఘాటించారు. పాఠశాలల్లో క్రీడలను ప్రధాన స్రవంతిలో చేర్చారనీ, దేశంలోనే మొట్టమొదటి క్రీడా విశ్వవిద్యాలయాన్ని మణిపూర్‌లో ఏర్పాటు చేస్తున్నారనీ శ్రీ మోదీ చెప్పారు.

ప్రభుత్వం ఈ రంగంలో చేస్తున్న కృషి మైదానంలోనే కాకుండా పతకాల పట్టికలో కూడా కనపడుతోందనీ, భారతీయ క్రీడాకారులు, క్రీడాకారిణులు ప్రతి ఒక్క అంతర్జాతీయ పోటీలో వారి ప్రతిభను కనబరుస్తూ వారిదైన ముద్రను వేస్తున్నారనీ ప్రధానమంత్రి ప్రధానంగా చెప్పారు. ఒలింపిక్స్‌లో, పారాలింపిక్స్‌లో భారత క్రీడాకారులు, క్రీడాకారిణులు శ్రేష్ఠ ప్రదర్శననిచ్చిన సంగతిని ఆయన ప్రశంసిస్తూ, ఉత్తరాఖండ్‌కు చెందిన చాలా మంది ఆటగాళ్లు కూడా పతకాలు సంపాదించారని గుర్తుచేశారు. ఈ ఆటల పోటీల్లో పాల్గొంటున్న వారిని ఉత్సాహపరచడానికి పతక విజేతలు అనేక మంది ఈ సభాస్థలానికి తరలివచ్చినందుకు శ్రీ మోదీ తన సంతోషాన్ని వ్యక్తం చేశారు.

హాకీ వెలిగిపోయిన రోజులు మళ్లీ తిరిగి వస్తున్నాయని శ్రీ మోదీ అభివర్ణించారు. భారతదేశ ఖో–ఖో జట్టు ఇటీవల ప్రపంచ కప్‌ను గెలిచింది, చిరంజీవి గుకేశ్ డి. ప్రపంచ చదరంగం చాంపియన్ షిప్‌ను సాధించి ప్రపంచాన్ని ఆశ్చర్యపరిచాడు. ఇంకా, కోనేరు హంపి ప్రపంచ ర్యాపిడ్ చెస్ ఈవెంట్‌లో మహిళా విజేతగా నిలిచారు అని ఆయన ప్రధానంగా ప్రస్తావించారు. ఈ విజయాలు భారత్‌లో క్రీడలు ఇక విద్యేతర కార్యకలాపాలుగానే ఎంతమాత్రం మిగిలిపోలేదని, యువత క్రీడలను వృత్తి పరంగా ఒక ప్రధాన ఎంపికగా భావిస్తున్నారని ప్రధాని స్పష్టం చేశారు.

"క్రీడాకారులు ఎప్పుడూ పెద్ద లక్ష్యాలను నిర్దేశించుకున్నట్టుగానే భారత్ కూడా గొప్ప తీర్మానాలతో ముందుకు సాగుతోంది'' అని ప్రధానమంత్రి వ్యాఖ్యానించారు. 2036 ఒలింపిక్ క్రీడలకు ఆతిథ్యమిచ్చేందుకు భారత్ విశేషంగా కృషి చేస్తోందని, ఇది భారత క్రీడా రంగాన్ని కొత్త శిఖరాలకు చేరుస్తుందని అన్నారు. ఒలింపిక్స్ కేవలం క్రీడా కార్యక్రమం మాత్రమే కాదని, ఆతిథ్య దేశంలో అనేక రంగాల్లో అది జవసత్వాలను నింపుతుందని శ్రీ మోదీ చెప్పారు. ఒలింపిక్స్ కోసం క్రీడా మౌలిక సదుపాయాల నిర్మాణం వల్ల ఉద్యోగావకాశాలు లభిస్తాయని, భవిష్యత్ క్రీడాకారులకు మెరుగైన సదుపాయాలు సమకూరుతాయని అన్నారు. ఒలింపిక్స్ ఆతిథ్య నగరంలో అనుసంధాన మౌలిక సదుపాయాలు మెరుగుపడి నిర్మాణ, రవాణా రంగాలకు ఊతమిస్తాయన్నారు. కొత్త హోటళ్ల నిర్మాణంతో పాటు ప్రపంచం నలుమూలల నుంచి వచ్చే క్రీడాకారులు, వీక్షకుల వల్ల దేశ పర్యాటక రంగానికీ గణనీయమైన లబ్ధి చేకూరుతుందని ప్రధానమంత్రి తెలిపారు. దేవభూమి ఉత్తరాఖండ్‌లో జరుగుతున్న జాతీయ క్రీడలు స్థానిక ఆర్థిక వ్యవస్థ వృద్ధికి కూడా దోహదపడుతాయన్నారు. దేశంలోని ఇతర ప్రాంతాల నుంచి వచ్చిన వీక్షకులు ఉత్తరాఖండ్ లోని వివిధ ప్రాంతాలను సందర్శిస్తారన్న ప్రధాని.. తద్వారా ఈ పోటీలు క్రీడాకారులకే కాకుండా ఆర్థిక వ్యవస్థలోని వివిధ రంగాలకూ ప్రయోజనం కలిగిస్తాయని స్పష్టం చేశారు.

21వ శతాబ్దాన్ని భారతదేశ శతాబ్దంగా ప్రపంచం కొనియాడుతోందని స్పష్టం చేసిన శ్రీ మోదీ.. బాబా కేదార్‌నాథ్‌ను దర్శించుకున్న అనంతరం ఇది ఉత్తరాఖండ్ దశాబ్దమన్న భావన సహజంగానే మదిలో మెదిలిందని వ్యాఖ్యానించారు. ఉత్తరాఖండ్ వేగంగా అభివృద్ధి చెందుతుండడంపై ఆయన హర్షం వ్యక్తం చేశారు. బిడ్డలు, తల్లులు, అక్కాచెల్లెల్ల గౌరవప్రదమైన జీవితానికి పునాదిగా నిలిచే ఉమ్మడి పౌర స్మృతిని అమలు చేసిన మొదటి రాష్ట్రంగా ఉత్తరాఖండ్ అవతరించిందని ప్రధానమంత్రి ప్రశంసించారు. ఇది ప్రజాస్వామ్య స్ఫూర్తిని, రాజ్యాంగ విలువలను బలోపేతం చేస్తుందన్నారు. దీనిని క్రీడా వేడుకకు అనుసంధానిస్తూ, క్రీడా స్ఫూర్తి వివక్షా భావాలన్నింటినీ తొలగిస్తుందని శ్రీ మోదీ వ్యాఖ్యానించారు. ప్రతి విజయమూ ప్రతి పతకమూ సమష్టి కృషి ద్వారానే లభిస్తాయని, క్రీడలు బృంద స్ఫూర్తిని ప్రేరేపిస్తాయని అన్నారు. వివక్ష లేకుండా అందరినీ సమానంగా పరిగణించే ఉమ్మడి పౌర స్మృతికి కూడా ఇదే స్ఫూర్తి వర్తిస్తుందని ప్రధానమంత్రి పేర్కొన్నారు. ఈ చారిత్రక చర్య తీసుకున్న ఉత్తరాఖండ్ ప్రభుత్వాన్ని ఆయన అభినందించారు.

ఇలాంటి భారీ కార్యక్రమానికి ఉత్తరాఖండ్ తొలిసారిగా ఆతిథ్యమిస్తున్నదని పేర్కొన్న ప్రధానమంత్రి.. ఇది ఆ రాష్ట్రం సాధించిన విశేషమైన విజయమని ప్రశంసించారు. దీని ద్వారా ఉపాధి అవకాశాలు మరింత పెరిగి స్థానిక యువతకు ఉద్యోగాలు లభిస్తాయన్నారు. ఉత్తరాఖండ్ ఆర్థిక వ్యవస్థ కేవలం చార్ ధామ్ యాత్రపైనే ఆధారపడకుండా, అభివృద్ధి కోసం కొత్త మార్గాలను అన్వేషించాలని ఆయన కోరారు. ఈ యాత్రల ఆకర్షణను పెంచేలా ప్రభుత్వం ఎప్పటికప్పుడు సౌకర్యాలను మెరుగుపరుస్తోందని, ప్రతి సీజన్‌లో యాత్రికుల సంఖ్య కొత్త రికార్డులను సృష్టిస్తోందని తెలిపారు. అయినప్పటికీ ఇది సరిపోదన్నారు. ఉత్తరాఖండ్‌లో శీతాకాలపు ఆధ్యాత్మిక యాత్రలను ప్రోత్సహించాల్సిన ఆవశ్యకత ఉందని శ్రీ మోదీ అన్నారు. ఈ దిశగా సరికొత్తగా చర్యలు తీసుకోవడంపై హర్షం వ్యక్తం చేసిన ఆయన.. ఈ శీతాకాల యాత్రల్లో పాలుపంచుకోవాలని భావిస్తున్నట్టు తెలిపారు. యాత్రికుల సంఖ్య తక్కువగా ఉన్న సమయంలో శీతాకాలాల్లో ఉత్తరాఖండ్ ను సందర్శించాలని దేశ యువతకు ఆయన సూచించారు. అనేక సాహస కృత్యాలకు అక్కడ అవకాశాలున్నాయన్నారు. జాతీయ క్రీడల అనంతరం ఈ అవకాశాలన్నింటినీ వినియోగించుకోవాలని, ఈ దేవభూమి ఆతిథ్యాన్ని మరికొన్ని రోజులు ఆస్వాదించాలని క్రీడాకారులను ఆయన కోరారు.

తమ తమ రాష్ట్రాలకు ప్రాతినిధ్యం వహించే క్రీడాకారులు జాతీయ రికార్డులను బద్దలు కొట్టి కొత్త రికార్డులను నెలకొల్పడానికి తీవ్రంగా పోటీ పడతారన్న ప్రధానమంత్రి.. అత్యుత్తమ ప్రదర్శన కనబరచాలని కోరారు. జాతీయ క్రీడలు కేవలం ఆటల పోటీలే కావనీ భారత వైవిధ్యాన్ని చాటిచెప్పే 'ఏక్ భారత్, శ్రేష్ఠ భారత్'కు వేదిక అనీ శ్రీ మోదీ స్పష్టం చేశారు. తమ పతకాలు దేశ ఐక్యతను, ఔన్నత్యాన్ని ప్రతిబింబిస్తాయని ప్రతి క్రీడాకారుడూ గుర్తించాలన్నారు. వివిధ రాష్ట్రాల భాషలు, వంటకాలు, సంగీతం గురించి తెలుసుకోవాలని ఆయన వారిని కోరారు. పారిశుద్ధ్యం ప్రాధాన్యాన్ని ప్రముఖంగా ప్రస్తావించిన ప్రధానమంత్రి.. ఉత్తరాఖండ్ ప్లాస్టిక్ రహితంగా ఎదిగేలా పురోగమిస్తోందని, క్రీడాకారుల సహకారం లేకుండా ఈ లక్ష్యాన్ని సాధించలేమని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయడానికి ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు.

శారీరక దారుఢ్య ప్రాధాన్యాన్ని, దేశంలో పెరుగుతున్న స్థూలకాయ సమస్యను ప్రధానమంత్రి ప్రముఖంగా ప్రస్తావించారు. స్థూలకాయం సమస్య యువత సహా అన్ని వయస్సుల వారిని ప్రభావితం చేస్తోందనీ మధుమేహం, గుండె జబ్బుల వంటి వ్యాధుల ప్రమాదాన్ని పెంచుతుందని అన్నారు. ఫిట్ ఇండియా ఉద్యమం ద్వారా ఫిట్‌నెస్, ఆరోగ్యకరమైన జీవనశైలిపై దేశ ప్రజలు మరింత అవగాహన పొందుతున్నారని శ్రీ మోదీ సంతృప్తి వ్యక్తం చేశారు. శారీరక శ్రమ, క్రమశిక్షణ, సమతౌల్య జీవనం ప్రాధాన్యాన్ని జాతీయ క్రీడలు వెల్లడిస్తాయన్నారు. వ్యాయామం, ఆహారం – ఈ రెండు విషయాలపైనా దృష్టి పెట్టాలని దేశ ప్రజలను ప్రధానమంత్రి కోరారు. నడక ద్వారా, లేదా కసరత్తుల ద్వారా ప్రతి ఒక్కరూ రోజూ కొంత సమయాన్ని వ్యాయామానికి కేటాయించాలని సూచించారు. సమతౌల్య, పోషకాహార ప్రాధాన్యాన్ని ఆయన ప్రముఖంగా ప్రస్తావించారు. అనారోగ్యకరమైన కొవ్వులు, నూనెల వినియోగాన్ని తగ్గించాలని కోరారు. ప్రతి నెలా వంట నూనెల వాడకాన్ని కనీసం 10% తగ్గించాలని ఆయన సూచించారు. చిన్న చిన్న చర్యలు ఆరోగ్యాన్ని విశేషంగా మెరుగుపరుస్తాయన్నారు. ఆరోగ్యకరమైన శరీరం ద్వారా ఆరోగ్యకరమైన మనస్సు సాధ్యపడుతుందనీ తద్వారా ఆరోగ్యకరమైన దేశాని నిర్మించవచ్చనీ ఆయన వ్యాఖ్యానించారు. శారీరక దారుఢ్యం, పోషకాహారంపై అవగాహన కల్పించాలని రాష్ట్ర ప్రభుత్వాలు, పాఠశాలలు, కార్యాలయాలు, బృంద నాయకులకు శ్రీ మోదీ పిలుపునిచ్చారు. సరైన పోషకాహారం ప్రాధాన్యంపై తమ ఆచరణాత్మక అనుభవాలను, పరిజ్ఞానాన్ని ప్రతి ఒక్కరూ ప్రజలతో పంచుకోవాలని కోరారు. 'ఫిట్ ఇండియా' నిర్మాణం కోసం సమష్టి కృషికి పిలుపునిస్తూ.. 38వ జాతీయ క్రీడల ప్రారంభాన్ని ప్రకటించిన ప్రధాని, క్రీడాకారులందరికీ శుభాకాంక్షలు తెలుపుతూ ప్రసంగాన్ని ముగించారు.

ఉత్తరాఖండ్ గవర్నర్, లెఫ్టినెంట్ జనరల్ (విశ్రాంత) గుర్మీత్ సింగ్, ముఖ్యమంత్రి శ్రీ పుష్కర్ సింగ్ ధామి, కేంద్ర సహాయ మంత్రులు శ్రీ అజయ్ తాంతా, శ్రీమతి రక్షా ఖడ్సేతోపాటు పలువురు ప్రముఖులు ఈ కార్యక్రమానికి హాజరయ్యారు.

రాష్ట్ర రజతోత్సవ సంవత్సరం వేళ ఉత్తరాఖండ్ లోని డెహ్రాడూన్‌లో 38వ జాతీయ క్రీడలను నిర్వహిస్తున్నారు. మంగళవారం నుంచి వచ్చే నెల 14 వరకు ఆ రాష్ట్రంలోని 8 జిల్లాలకు చెందిన 11 నగరాలు ఈ క్రీడలకు వేదికలు కానున్నాయి.

జాతీయ క్రీడల్లో 36 రాష్ట్రాలు, ఒక కేంద్రపాలిత ప్రాంతం పాల్గొంటున్నాయి. 17 రోజుల పాటు 35 క్రీడా విభాగాల్లో పోటీలు నిర్వహించనున్నారు. వీటిలో 33 క్రీడలకు పతకాలు అందజేస్తారు. మరో రెండు ప్రదర్శన క్రీడలు. యోగా, మల్లఖంబ్‌లను తొలిసారిగా జాతీయ క్రీడల్లో చేర్చారు. దేశవ్యాప్తంగా 10,000 మందికి పైగా క్రీడాకారులు ఈ కార్యక్రమంలో పాల్గొంటారు.

సుస్థిరతను పెంపొందించడంపై దృష్టిసారించి ఈ ఏడాది జాతీయ ఇతివృత్తాన్ని 'గ్రీన్ గేమ్స్'గా నిర్ణయించారు. వేదిక సమీపంలో స్పోర్ట్స్ ఫారెస్ట్ పేరుతో ప్రత్యేక పార్కును ఏర్పాటు చేస్తారు. క్రీడాకారులు, అతిథులు అక్కడ 10,000 కన్నా ఎక్కువ మొక్కలు నాటుతారు. క్రీడాకారుల పతకాలు, ధ్రువీకరణ పత్రాలను పర్యావరణ హిత, బయో డీగ్రేడబుల్ వస్తువులతో తయారు చేస్తారు.

# నేటి నుంచి వాట్సప్ గవర్నెన్స్ సేవలు -లాంఛనంగా ప్రారంభించిన నారా లోకేష్

**-లాంచనంగా ప్రారంభించిన నారా లోకేష్**
**-వాట్సప్ ద్వారా ఇంటి నుంచే 161 సేవలు**
**-వాట్సప్ గవర్నెన్స్ కోసం నెంబర్ 9552300009 కేటాయింపు**
**-దేశంలో తొలిసారిగా ఎపిలోనే ఈ సేవలు అందుబాటు**
**-కార్యాలయాలు చుట్టు తిరిగే అవస్థలకు ఇక బై బై**
**-మన మిత్ర పేరుతో ఇక వాట్సప్ సేవలు**

అమరావతి, జనవరి 30:ఆంధ్రప్రదేశ్‌లో మన మిత్ర పేరుతో వాట్సప్ గవర్నెన్స్ సేవలు నేటి నుంచి అందుబాటులోకి వచ్చాయి.. ఈ సేవలను నేడు ను మంత్రి నారా లోకేష్ ప్రారంభించారు. ఇక నుంచి ప్రభుత్వ ధృవపత్రాలన్నీ వాట్సప్ ద్వారానే ప్రజలకు అందేలా చర్యలు తీసుకుం



టామని చెప్పారు. ఈ సందర్భంగా వాట్సప్ సేవల కోసం నెంబర్‌ను విడుదల చేశారు మంత్రి లోకేష్. వాట్సప్ గవర్నెన్స్ కోసం నెంబర్ 9552300009ను అనౌన్స్ చేశారాయన.

ప్రజలకు అవసరమైన సేవలు అందించేందుకు, వినతులు స్వీకరించేం దుకు, అవసరమైన సమాచారం చేరవేసే ఉద్దేశ్యంతో దీన్ని ప్రారంభిస్తున్నట్లు వెల్లడించారు. తొలి దశలో 161 రకాల సేవలు, రెండో దశలు 300 రకాల సర్వీసులు అందుబాటులో ఉండనున్నాయి. దీని కోసం అధికారిక వాట్సాప్ నెంబర్ 9552300009 నెంబర్ ను ప్రభుత్వం కేటాయించింది. తొలి దశలో దేవాదాయ, ఇంధన, ఆర్టీసీ, రెవిన్యూ, మున్సిపల్ శాఖల్లో వాట్సాప్ సేవలు మొదలయ్యాయి.

విద్యుత్ బిల్లులు, ఆస్తి పన్నుల వంటివి వాట్సాప్ ద్వారా చెల్లించవచ్చు. అలాగే ట్రేడ్ లైసెన్సులు, రెవిన్యూ శాఖకు సంబంధించి ల్యాండ్ రికార్డులు, సర్టిఫికెట్లు, ఆర్టీసీ టికెట్ బుకింగ్, క్యానిల్, జర్నీ రిమైండర్, ట్రాకింగ్ సర్వీసు, రిఫండ్, ఫీడ్ బ్యాక్ వంటి సేవలు పొందవచ్చు. ప్రజలకు–ప్రభుత్వానికి మధ్య ఇదొక ప్లాట్ ఫామ్‌గా వర్ణించారు మంత్రి లోకేష్.

ఫిర్యాదుల విషయంలో అయితే ఈ వాట్సాప్ నెంబర్‌కు మెసేజ్ చేస్తే వెంటనే ఓ లింక్ వస్తుంది. అందులో పేరు, ఫోన్ నెంబర్, చిరునామా, వినతులను పొందుపరచాలి. వెంటనే వారికి రిఫరెన్స్ నెంబర్ వస్తుంది. వాటి ఆధారంగా తమ సమస్య ఎంతవరకు పరిష్కారం అయ్యిందో తెలుసుకోవచ్చు.

ఇదేకాకుండా ప్రభుత్వ సంక్షేమ పథకాలు, అర్హతలు గురించి వివరాలు తెలుసుకునే వీలుంది. ఇక పర్యాటక ప్రదేశాల సమాచారాన్ని వాట్సాప్‌లో పంపిస్తారు. కావాల్సిన ప్రాంతాన్ని ఎంపిక చేసుకుని టికెట్లు, వసతి సహా అన్నీ బుక్ చేసుకోవచ్చు.

ఇవేకాకుండా ఓబీసీ, ఈడబ్ల్యూఎస్, ఆదాయం, నో ఎర్నింగ్ ఇలా అనేక రకరకాలకు సంబంధించి వాట్సాప్ ద్వారా సేవలను పొందవచ్చు. సీఎం సహాయనిధికి చేసిన దరఖాస్తు స్టేటస్ సైతం తెలుసుకునే వీలుంది.

సర్టిఫికెట్ల కోసం ప్రజలు ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరిగే విధానానికి స్వస్తి పలకాలని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నిర్ణయించింది. పౌరుల సమాచారం సైబర్ నేరగాళ్లకు చిక్కకుండా ఫోరెన్సిక్, సైబర్ సెక్యూరిటీ ఇవ్వాలని సీఎం ఆదేశించారు. వాట్సప్ ద్వారా పౌరసేవలు అందించేందుకు 2024 అక్టోబరు 22న మెటా సంస్థతో ప్రభుత్వం ఒప్పందం చేసుకుంది. ఈ ఒప్పందం మేరకు ఇప్పుడు వాట్సప్ గవర్నెన్స్ తీసుకువచ్చింది రాష్ట్ర ప్రభుత్వం. వేగంగా పౌరసేవలు అందించటం, పారదర్శకత, జవాబుదారీ తనంలో భాగంగా వాట్సప్ గవర్నెన్స్ అందుబాటులోకి తీసుకువచ్చారు. సమాచార గోప్యత, వేగంగా సేవలందించేందుకు జనరేటివ్ ఆర్టీఫీషియల్ ఇంటెలిజెన్స్ ద్వారా వాట్సప్ గవర్నెన్స్ పని చేస్తుంది. ఈ సేవలకు మన మిత్ర అని నామకరణం చేశారు.

# ఆన్‌లైన్ సెక్స్ రాకెట్ ముఠా గుట్టురట్టు

**-15 మందిని అరెస్టు చేసిన టూటౌన్ పోలీసులు**

అమరావతి, జనవరి 30: లక్జరీ లైఫ్‌ను అలవాటు చేసి అమ్మాయిలను, గృహిణులను తమ స్వాధీనంలో ఉంచుకుని తక్కువ సమయంలో ఎక్కువ డబ్బు కోసం అమాయక మరియు ఆర్థికంగా బలహీన వర్గాల మహిళలను లక్ష్యంగా చేసుకుని పెద్ద ఎత్తున ఆన్‌లైన్ వ్యభిచారం నిర్వహించిన ముఠాను రెండవ పట్టణ పోలీసులు అరెస్టు చేశారు. ఈ సెక్స్ రాకెట్ కేసులో ఇప్పటికే 11 మందిని అరెస్టు చేసి రిమాండ్ కు పంపించారు.

అక్కడితో ఆగకుండా ఇంకా ఈ కేసులో ఎంతమంది ఉన్నారో విచారణ వేగవంతం చేశారు. ఇంత పెద్ద సెక్స్ నెట్ వర్క్ నడుపుతున్న ప్రధాన రావాడ కామరాజు (28) టెక్నాలజీని వాడుతూ ఎప్పటికప్పుడు ప్లేస్ చేంజ్ చేస్తూ నడిపించాడని పోలీసులు వెల్లడించారు. అమ్మాయి కావాలంటూ తమను సంప్రదించి విటులకు అమ్మాయిల వివరాలు, కలుసుకునే చోటు, ఎప్పుడు ఎక్కడ మీట్ అవుతారు ఇలా ప్రతీది ఆన్ లైన్ ద్వారానే జరిగిపోతుంది. అలాగే వారికి డబ్బులు వచ్చేస్తాయి. ప్రధాన నిందితుడు కామరాజును పోలీసులు విచారణలో బుధవారం మరో నలుగురుని అరెస్టు చేసి రిమాండ్ కు పంపించారు.

# కాన్వాయ్‌లో కార్లు ఢీ -కేంద్రమంత్రులకు తృటిలో తప్పిన ప్రమాదం



విశాఖపట్నం, జనవరి 30: విశాఖ స్టీల్ ప్లాంట్ పరిశీలన కోసం వచ్చిన కేంద్ర మంత్రులు కుమారస్వామి, శ్రీనివాస వర్మ లకు తృటిలో ప్రమాదం తప్పింది.. ఉక్కు పరిశ్రమకు రూ. 11,440 కోట్ల కేంద్ర ప్యాకేజీ ప్రకటించిన తర్వాత తొలిసారి కేంద్ర ఉక్కుశాఖ మంత్రికుమారస్వామి విశాఖకు చేరుకున్నారు.

ఆయన మరో మంత్రి శ్రీనివాసవర్మతో కలసి ఎయిర్‌పోర్ట్ నుంచి స్టీల్ ప్లాంట్‌కు కారులో వెళున్న సమయంలో షీలా నగర్ వద్ద కాన్వాయ్‌లోని మూడు వాహనాలు ఒకదానితో మరొకటి ఢీకొన్నాయి.. దీంతో ఎనిమిది వాహనాల కాన్వాయ్‌లో మూడు కార్లు స్వల్పంగా దెబ్బతిన్నాయి.. ధ్వంసమైన కారులో మాజీ ఎంపీ జీవీఎల్ నరసింహారావు కారు కూడా ఉంది..కాగా విశాఖకు విమానంలో వచ్చిన కుమారస్వామికి ఎయిర్ పోర్ట్ లో ఎంపీలు భరత్, అప్పల నాయుడు, బీజేపీ నేతలు స్వాగతం పలికారు..

ఆహ్వానము
రావి రంగారావు సాహిత్యపీఠం గుంటూరు
2025 ఫిబ్రవరి 7 శుక్రవారం సా. 6 గం. కు
అన్నమయ్య కళా వేదిక, బృందావన్ గార్డెన్స్
శ్రీ వేంకటేశ్వర స్వామి దేవాలయ ప్రాంగణం, గుంటూరు
స్వాగతం : డా. రావి అరుణ, డైరెక్టర్, రావి రంగారావు సాహిత్య పీఠం
జ్యోతి ప్రకాశం : శ్రీ చిటిపోతు మస్తానయ్య, అధ్యక్షులు, దేవాలయ పాలక మండలి
సభాధ్యక్షులు : శ్రీ గద్దె మంగయ్య, కార్యదర్శి, ఆర్ వి ఆర్ ఆర్ విద్యా కళాశాల
ముఖ్య అతిథి : శ్రీ గోనుగుంట్ల కోటేశ్వరరావు, అధ్యక్షులు, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గ్రంథాలయ పరిషత్
విశిష్ట అతిథి : డా. తరపట్ల సత్యనారాయణ, అసిస్టెంట్ ప్రొఫెసర్, ఆదికవి నన్నయ విశ్వ విద్యాలయం, రాజమండ్రి
పురస్కార కార్యక్రమ నిర్వహణ : డా. మైలవరపు లలిత కుమారి
జన రంజక కవి ప్రతిభా పురస్కార గ్రహీతలు
శ్రీమతి గుమ్మా నాగ మంజరి : "పుష్ప మంజరి" (పద్యాలు)
శ్రీ ప్రకాష్ నాయుడు : నాన్న ఎందుకో వెనకబడ్డాడు (వచన కవితలు)
శ్రీ రాజేశ్వరరావు లేదాళ్ళ : అమ్మకు ఓ జత చెప్పులు కొనాలి (వచన కవితలు)
శ్రీరత్నాజీ నేలపూరి : గాజా లేని జాగా
వందన సమర్పణ : శ్రీ గడల శివ ప్రసాద్
రావి రంగారావు సాహిత్య పీఠం (రి. నం. 6/2016),

# రహదారి భద్రత... మీ బాధ్యత...అదే మా ప్రాధాన్యత...

## -భద్రతే నీ జీవితానికి నేస్తం...అది లేకుంటే నీ జీవితం అస్తవ్యస్తం
## -రెడ్ క్రాస్ ఆధ్వర్యంలో రోడ్డు భద్రత వారోత్సవాల పోస్టర్ విడుదల

హైదరాబాద్ జనవరి 30 (ఎక్స్ ప్రెస్ న్యూస్);ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ హైదరాబాద్ జిల్లా శాఖ చైర్మన్ మామిడి భీమ్ రెడ్డి గారి



ఆధ్వర్యంలో ప్రభుత్వం ద్వారా రూపొందించిన నియమ నిబంధనల గురించి ప్రజలకు చెప్పడానికి అనేక వర్క్ షాపులు, సెమినార్లు, మీటింగ్ లు నిర్వహించబడతాయి. ఇది కేవలం ముందస్తు జాగ్రత్త చర్యలు పైన మాత్రమే కాకుండా బ్యానర్లు, కరపత్రాలు ద్వారా కూడా ప్రజానీకానికి అవగాహన కల్పించడం జరుగుతుంది. కాబట్టి ఈ రోడ్డు భద్రత వారోత్సవాల పోస్టర్ ను ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ తెలంగాణ రాష్ట్ర శాఖ జనరల్ సెక్రటరీ ప్రొఫెసర్ శ్రీరాములు చేతుల మీదుగా హిమాయత్ నగర్ లోని రాష్ట్ర ప్రధాన కార్యాలయంలో లో విడుదల చేయడం జరిగింది. ఈ సందర్భంగా శ్రీరాములు మాట్లాడుతూ భారత దేశంలో 2020 జనవరి 11 నుంచి జనవరి 31 వరకు రోడ్డు భద్రత వారోత్సవాలు జరుగుతున్నాయి. రోడ్డు భద్రత వారోత్సవాల ప్రధాన లక్ష్యం వీధులను సురక్షితంగా ఉంచడం. భారతదేశపు రహదారులు పూర్తిగా ప్రమాద రహిత ప్రాంతాలుగా మార్చేందుకు వాహనదారులకు అవగాహన కల్పించడం జరుగుతుందని తెలిపారు. రెడ్ క్రాస్, స్టేట్ ట్రెజరర్ డాక్టర్ ఓ. ఎస్ రెడ్డి గారు మాట్లాడుతూ ముఖ్యంగా తెలుసుకోవలసిన విషయాలు భారతదేశంలోని రోడ్డు భద్రత గురించి ప్రతి పౌరుడు విమర్శించినప్పటికీ క్షేత్రస్థాయిలో ఇంకా ఎంతో చేయాల్సి ఉందని అన్నారు. డ్రైవింగ్ చేసేటప్పుడు ఒకే లైన్ అనుసరించాలి. అవసరమైనప్పుడు ఇండికేటర్ ని ఉపయోగించాలి. గడువు తీరిన లైసెన్స్ తో మీరు డ్రైవ్ చేయకుండా చూసుకోవాలి. డ్రైవ్ చేసేటప్పుడు ద్విచక్ర వాహనదారులు తప్పకుండా హెల్మెంట్ ధరించాలి. ఇక చిట్టా చివరి విషయం మీ వాహనాలు దయచేసి పార్కింగ్ జోన్లు లో మాత్రమే పార్క్ చేయండి అని తెలిపారు. భీమ్ రెడ్డి గారు మాట్లాడుతూ రెడ్ క్రాస్ హైదరాబాద్ జిల్లా శాఖ.... రహదారి భద్రత... మీ... బాధ్యత అదే మా ప్రాధాన్యత... మరియు భద్రతే నీ... జీవితానికి నేస్తం అది లేకుంటే నీ... జీవితం అస్తవ్యస్తం అని నినాదాలతో వాహనదారులకు మరియు ప్రయాణదారులకు అవగాహన కల్పించడం జరుగుతుంది అని తెలిపారు. ఈ పోస్టర్ విడుదల సందర్భంగా రెడ్ క్రాస్ రాష్ట్ర పరిపాలన అధికారి వర్మ, రెడ్ క్రాస్ హైదరాబాద్ జిల్లా శాఖ వైస్ చైర్మన్ విజయ కుమారి, మాజీ ఎంసీ సభ్యులు మహమ్మద్ రియాజుద్దీన్, ఆసిఫ్ నగర్ మండల కన్వీనర్ పి ఈ రవికుమార్, విజయలక్ష్మి, మల్లికార్జున్, వెంకట్, సత్యలక్ష్మి మరియు వాలంటీర్లు పాల్గొన్నారు.

# ప్రకృతి పరిరక్షణలో "నేను సైతం"

## విద్యార్థులకు ఆన్లైన్ చిత్రలేఖనం పోటీలు

### -ఎన్విరాన్మెంట్ ప్రొటెక్షన్ & డెవలప్మెంట్ కౌన్సిల్ వ్యవస్థాపక అధ్యక్షులు ఎస్సీహెచ్ రంగయ్య

హైదరాబాద్- జనవరి 29 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );పర్యావరణ సమతుల్యతలో కీలకమైన- ప్రపంచ చిత్తడి నేలల దినోత్సవాన్ని (ఫిబ్రవరి 2 -లినీతీశ్రీట లివబిశ్రీజీనిటబ టజీఎ ) పురస్కరించుకొని 10వ తరగతి లోపు విద్యార్థిని విద్యార్థులకు "ప్రకృతి - పర్యావరణం" అనే అంశంపై 'పర్యావరణ పరిరక్షణలో నేను సైతం...' పేరుతో ఆన్లైన్ చిత్రలేఖన పోటీ నిర్వహించనున్నట్లు ఎన్విరాన్మెంట్ ప్రొటెక్షన్ & డెవలప్మెంట్ కౌన్సిల్ వ్యవస్థాపక అధ్యక్షులు ఎస్సీహెచ్ రంగయ్య బుధవారం ఒక ప్రకటన పేర్కొన్నారు. ఈ నేచర్ పెయింటింగ్ కాంపిటేషన్ లో 13 ఏళ్ళ లోపు వారు జూనియర్ గా , 17 ఏళ్ళ లోపు సీనియర్లుగా మొత్తం 2విభాగాల్లో పోటీ జరుగుతోంది. తొలి బహుమతి 5,000/- రెండు, మూడు బహుమతులుగా 3,000/- , 2000/- ఇవ్వబడును. మరో 20మంది విజేతలకు వెయ్యి రూపాయల కన్సోలేషన్ ప్రైజ్, గ్రీన్ సోల్జర్ అవార్డు, సర్టిఫికెట్ అందజేయబడుతుంది. అంతేగాక పోటీలో పాల్గొన్న ప్రతి ఒక్క విద్యార్థికి తాను గీసిన చిత్రం, వారి ఫోటోతో కూడిన పార్టిసిపేషన్ సర్టిఫికెట్ 24 గంటల్లో ఆన్లైన్ లో పంపబడుతుంది. సమాజంలో పర్యావరణ అవగాహన, పరిరక్షణ పెంచడంలో భాగంగా కౌన్సిల్ ఈ పెయింటింగ్ కార్యక్రమాన్ని నిర్వహిస్తోంది. పోటీలో పాల్గొనే విద్యార్థులు తమ కుటుంబ సభ్యుల సహకారంతో చిత్రాన్ని గీసి ఆన్లైన్ లో పంపించాల్సి ఉంటుంది. చిత్రంతో పాటు పూర్తి చిరునామా, విద్యార్థి పాస్పోర్ట్ సైజ్ ఫొటో కూడా ఆన్లైన్ లో పంపాలి. విజేతలను మార్చి 3 -ప్రపంచ వన్యప్రాణుల దినోత్సవం సందర్భంగా ప్రకటించి మార్చి 22 - ప్రపంచ నీటి దినోత్సవం సందర్భంగా హైదరాబాద్ లో జరిగే కార్యక్రమంలో బహుమతి ప్రదానం చేయబడుతుంది. మరిన్ని పూర్తి వివరాలు త్వరలో వెల్లడిస్తామని కౌన్సిల్ అధ్యక్షులు రంగయ్య తెలిపారు

# ప్రజా సమస్యలను పరిష్కరిస్తాం : ఎమ్మెల్యే కృష్ణారావు



హైదరాబాద్, జనవరి 30:అల్లాపూర్ డివిజన్ లో నెలకొన్న ప్రజా సమస్యలను పరిష్కరిస్తానని కూకట్పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావుఅన్నారు. గురువారం కూకట్పల్లి ఎమ్మెల్యే క్యాంప్ ఆఫీస్లో అల్లాపూర్ డివిజన్ ముస్లిం ముఖ్యనేతలతో సమావేశం నిర్వహించారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ..డివిజన్ పరిధిలోని కాలనీలు, బస్తీలలో మౌలిక వసతులకు ప్రాధాన్యతనిస్తూ అభివృద్ధి పనులు చేశామన్నారు.

అల్లాపూర్ డివిజన్లోని ముస్లిం శ్మశాన వాటికలలో సమస్యలను పరిష్కరిస్తామని హామీనిచ్చారు.

రేపు అధికారులతో కలసి శ్మశాన వాటికలను పరిశీలిస్తానని, ఆయా సమస్యలను పరిష్కరించేలా చర్యలు తీసుకుంటానని తెలిపారు.

కార్యక్రమంలో జిల్లా మైనార్టీ అధ్యక్షుడు గౌసుద్దిన్, మైనార్టీ నేతలు ఉన్నారు.

# త్వరలోనే ఎమ్మెల్సీ స్థానాలపై నిర్ణయం

## -టిపిసిసి అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్

హైదరాబాద్ జనవరి 30 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );త్వరలోనే ఎమ్మెల్సీ స్థానాలపై నిర్ణయం తీసుకుంటామని రాష్ట్ర కాంగ్రెస్ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ అన్నారు. తెలంగాణలో ఉమ్మడి మెదక్, నిజామాబాద్, ఆదిలాబాద్ పట్టభద్రుల ఎన్నికతో పాటు వరంగల్, ఖమ్మం, నల్గొండ టీచర్ ఎమ్మెల్సీ ఎన్నిక జరుగనుంది. ఈ నేపథ్యంలో ఎమ్మెల్సీ ఎన్నికలపై కాంగ్రెస్ కసరత్తు చేస్తోంది. ఈ మేరకు గురువారం మహేష్ కుమార్ గౌడ్ మీడియాతో మాట్లడుతూ.. ఫిబ్రవరి 3న ఎమ్మెల్సీ ఎన్నికలపై సమావేశం నిర్వహించిన నిర్ణయం తీసుకుంటామని తెలిపారు.కాగా, బుధవారం ఎమ్మెల్సీ ఎన్నికలకు షెడ్యూల్ విడుదల చేసింది కేంద్ర ఎన్నికల సంఘం. ఈ ఎన్నికలకు ఫిబ్రవరి 3న నోటిఫికేషన్ విడుదల కానుంది. ఫిబ్రవరి పది వరకు నామినేషన్ల దాఖలుకు గడువు ఉండగా, ఫిబ్రవరి 11న నామినేషన్ల పరిశీలన, నామినేషన్ల ఉపసంహారణకు 13 వరకు గడువు ఉంటుందని ఎన్నికల సంఘం పేర్కొంది. ఫిబ్రవరి 27న ఉదయం ఎనిమిది గంటల నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకు పోలింగ్ జరుగుతుంది. అనంతరం మార్చి 3న ఓట్ల లెక్కింపు చేపట్టనున్నట్లు పేర్కొంది. ఎన్నిక ప్రక్రియను మార్చి 8 వరకు పూర్తి చేయాలని ఎన్నికల సంఘం స్పష్టం చేసింది.

# దేశంలోనే అత్యంత సంపన్న పార్టీగా నిలిచిన బిజెపి

## -మార్చి 2024 నాటికి ఆ పార్టీ వద్ద రూ.7,113.80 కోట్ల క్యాష్ డిపాజిట్లు

న్యూ డిల్లీ జనవరి 30 (ఎక్స్ ప్రెస్ న్యూ స్);ప్రపంచంలోనే అతిపెద్ద పార్టీగా చెప్పుకునే భారతీయ జనతా పార్టీ.. దేశంలోనే అత్యంత సంపన్న పార్టీగా నిలిచింది. మార్చి 2024 నాటికి ఆ పార్టీ వద్ద రూ.7,113.80 కోట్ల క్యాష్ డిపాజిట్లు ఉండగా.. ప్రధాన ప్రతిపక్షమైన కాంగ్రెస్ వద్ద రూ.857.15 కోట్లు ఉన్నాయి. ఈ రెండు పార్టీలు ఎన్నికల కమిషన్కు ఇచ్చిన డేటాతో ఈ సమాచారం వెలుగులోకి వచ్చింది. 2023-24లో లోక్సభ ఎన్నికలు ప్రకటించిన సమయంలో బీజేపీ రూ.1,754.06 కోట్లు ఖర్చు చేసింది. ఈ మొత్తం 2022-23లో ఖర్చు చేసిన రూ.1,092 కోట్ల కంటే 60 శాతం ఎక్కువ. ఇక కాంగ్రెస్ పార్టీ 2023-24లో రూ.619.67 కోట్లు.. 2022-23లో రూ.192.56 కోట్లు ఖర్చు చేసింది. లోక్సభ ఎన్నికల షెడ్యూల్ గతేడాది మార్చిలో ప్రకటించిన విషయం తెలిసిందే.

ఎలక్టోరల్ బాండ్ల రూపంలో బీజేపీకి..

రాజకీయ పార్టీలు ఎన్నికల కమిషన్కు అందించిన వార్షిక ఆడిట్ డేటా ప్రకారం.. 2023-24లో.. ప్రస్తుతం నిషేధించిన ఎలక్టోరల్ బాండ్ల రూపంలో బీజేపీకి రూ.1,685.69 కోట్లు స్వచ్ఛంద విరాళాలు అందాయి. గత సంవత్సరంలో ఆ పార్టీకి ఆ పార్టీకి రూ.1,294.15 కోట్లు వచ్చాయి. 2022-23 సంవత్సరంలో రూ.648.42 కోట్లు అందగా.. అదే ఏడాది బీజేపీకి రూ.2042.75 కోట్ల ఇతర గ్రాంట్లు కూడా అందాయని ఈసీకి ఇచ్చిన ఆడిట్లో బీజేపీ పేర్కొంది. ఈసీకి అందించిన ఆడిట్ నివేదికలో 2023-24లో మొత్తం రూ.1,225.11 కోట్ల విరాళాలు వచ్చాయని కాంగ్రెస్ పార్టీ తెలిపింది. ఇందులో గ్రాంట్లు, విరాళాలు విరాళాల ద్వారా వచ్చినవి రూ.1,129.67 కోట్లు ఉన్నాయని తెలిపింది. మార్చి 31, 2024తో ముగిసిన సంవత్సరంలో ఎన్నికల బాండ్ల ద్వారా వచ్చిన రూ.828.36 కోట్లు ఇందులోనే ఉన్నాయని చెప్పింది. గతకొద్ది నెలల కింద సుప్రీంకోర్టు ఎలక్టోరల్ బాండ్లను నిషేధించిన విషయం తెలిసిందే.

ప్రకటనల కోసం రూ.591కోట్లు ఖర్చు చేసిన బీజేపీ..

నివేదిక ప్రకారం.. ప్రకటనల కోసం కాషాయ పార్టీ రూ.591కోట్లు ఖర్చు చేసింది. ఇందులో అగ్రభాగం ఎలక్ట్రానిక్ మీడియాలో ప్రకటనల కోసమే రూ.434.84కోట్లు ఖర్చు చేసింది. ప్రింట్ మీడియాలో ప్రకటనల కోసం రూ.115.62 కోట్లు ఉన్నాయి. 2023-24లో అధికార పార్టీ విమానాలు, హెలికాప్టర్ల కోసం రూ.174 కోట్లు ఖర్చు చేసింది. 2022-23లో ఆ పార్టీ రూ. 78.23 కోట్లు ఖర్చు పెట్టింది. ఇక ప్రతిపక్ష కాంగ్రెస్ 2023-24లో ప్రకటనల కోసం కాంగ్రెస్ రూ. 251.67 కోట్లు ఖర్చు చేసింది. ఇందులో ఎలక్ట్రానిక్ మీడియా ప్రకటనల కోసం రూ. 207.94 కోట్లు.. ప్రింట్ మీడియాలో ప్రకటనల కోసం రూ.43.73 కోట్లు వెచ్చించింది.

అదే సమయంలో విమానాలు, హెలికాప్టర్ల కోసం రూ.62.65 కోట్లు చెల్లించింది. 2023-24లో పార్టీ తన అభ్యర్థులకు ఆర్థిక సహాయంగా రూ.238.55 కోట్లు ఇచ్చింది. మార్చి 31, 2024తో ముగిసిన ఆర్థిక సంవత్సరంలో ప్రచార ఖర్చుల కోసం రూ.28.03 కోట్లు, సోషల్ మీడియా ఖర్చుల కోసం రూ.79.78 కోట్లు ఖర్చు చేసింది. 2023-24లో భారత్ జోడోయాత్ర-2 కోసం రూ.49.63 కోట్లు ఖర్చు చేసినట్లుగా ఆడిట్ నివేదికలో కాంగ్రెస్ పార్టీ పేర్కొంది. 2022-23లో కన్యాకుమారి నుంచి కశ్మీర్ వరకు జరిగిన భారత్ జోడోయాత్ర మొదటి విడుదలో రూ.71.84 కోట్లు ఖర్చు తెలిపింది. కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ ఈ భారత్ జోడో యాత్ర చేపట్టిన విషయం తెలిసిందే.

# కల్తీ మద్యం ముఠా గుట్టు రట్టు

## -ఐదుగురి అరెస్ట్.. రూ.8లక్షల విలువైన మద్యం సీజ్



హైదరాబాద్, జనవరి 30:: నగరంలో కల్తీ మద్యం ముఠా గుట్టును హైదరాబాద్ ఎక్సైజ్ ఎన్ఫోర్స్మెంట్ అధికారులు రట్టు చేశారు. ఆబ్కారీ ఈడీ కమలాసన్రెడ్డి కథనం ప్రకారం?నగరంలో పెద్దఎత్తున కల్తీ మద్యం విక్రయాలు జరుగుతున్నట్లు విశ్వసనీయ సమాచారం మేరకు గత రెండురోజులుగా నగరంలోని అమీర్పేట, యూసుఫ్గూడ తదితర ప్రాంతాల్లో రూట్వాచ్ నిర్వహించారు.

అమీర్పేట, కృష్ణానగర్లో జరిపిన తనిఖీల్లో అటుగా వెళ్తున్న మనీష్, పవన్ల వద్ద ఉన్న బ్యాగ్ను తనిఖీ చేయగా..అందులో 9 ఖరీదైన నాన్డ్యూటీ పెయిడ్ మద్యం బాటిళ్లు లభించాయి. దీంతో నిందితులను అదుపులోకి తీసుకుని విచారించగా.. పట్టుబడిన మద్యం ఖరీదైనది కాదని, అది నకిలీ మద్యమని వెల్లడించారు. నిందితులు ఇచ్చిన సమాచారం మేరకు మాదాపూర్, అయ్యప్ప సొసైటీ, సాయినగర్లోని ఓ ఇంటిపై దాడులు జరిపారు.

ఈదాడుల్లో ఖరీదైన ఖాళీ మద్యం సీసాల్లో నకిలీ మద్యం నింపుతున్న ఒరిశాకు చెందిన రుద్రప్రతాప్ రౌత్, సత్యప్రకాశ్రౌత్, రింకుజాన్లను రెడ్హ్యాండెడ్గా పట్టుకున్నారు. నిందితుల వద్ద నుంచి ఖరీదైన 14మద్యం బాటిళ్లు, 63ఖరీదైన ఖాళీ మద్యం సీసాలు, మూతలు, లేబుల్స్ స్వాధీనం చేసుకున్నారు. స్వాధీనం చేసుకున్న మద్యం విలువ రూ.8లక్షల వరకు ఉంటుందని అధికారులు తెలిపారు. అయితే నిందితులు పలు బార్లు, వైన్షాపుల్లో పనిచేస్తూ అక్కడ ఉన్న ఖాళీ సీసాలు, వాటి మూతలు సేకరించి గత కొంత కాలంగా ఈ నకిలీ మద్యం దందా నిర్వహిస్తున్నట్లు ఆబ్కారీ అధికారులు వెల్లడించారు.

నకిలీ మద్యం పట్టుకున్న వారిలో ఎన్ఫోర్స్మెంట్ సిఐ చంద్రశేఖర్, అమీర్పేట సీఐ బానోతు పటేల్, ఎస్ఐ శ్రీనివాస్, హెడ్కానిస్టేబుల్ మల్లికార్జున్, కానిస్టేబుళ్లు కరణ్, శ్రీకాంత్, గోపాల్, అక్షర తదితరులు పాల్గొన్నారు. కాగా, నకిలీ మద్యం పట్టుకున్న సిబ్బందిని ఈ సందర్భంగా ఆబ్కారీ ఈడీ కమలాసన్రెడ్డి అభినందించారు.

# తెలంగాణ సచివాలయంలో భద్రతా లోపం

## -ఫేక్ ఐడితో దొరికిన ఓ వ్యక్తి ..పోలీసుల అరెస్ట్

హైదరాబాద్ జనవరి 30 (ఎక్స్ ప్రెస్ న్యూస్ ); : తెలంగాణ సచివాలయంలో భద్రతా లోపం బయటపడింది. సచివాలయంలో ఫేక్ ఐడితో ఓ వ్యక్తి దొరికాడు. రెవెన్యూ శాఖలో జూనియర్ అసిస్టెంట్గా చెప్పుకుంటూ సదరు వ్యక్తి బిల్డప్ ఇస్తున్నాడు. నకిలీ ఉద్యోగి కదలికలు అనుమానంగా ఉండడంతో సెక్రటేరియట్ సిఎస్ఒ దేవిదాస్ ఆదేశాల మేరకు ఇంటెలిజెన్స్ నిఘా ఉంచి పట్టుకుంది. ఖమ్మం జిల్లాకు చెందిన భాస్కర్ రావు రెవెన్యూ శాఖలో ఉద్యోగిగా ఫేక్ ఐడి కార్డుతో చలామణి అవుతున్నాడు.

భాస్కర్ రావుకు సహకరించిన డ్రైవర్ రవిని పోలీసులు అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మైనార్టీ డిపార్ట్మెంట్ సెక్షన్ ఆఫీసర్ వి ప్రశాంత్, డ్రైవర్ రవిలు ఫేక్ ఐడీ కార్డు తయారు చేసి భాస్కర్ రావు ఇచ్చినట్లు ఎస్పిఎఫ్ ఇంటెలిజెన్స్ గుర్తించింది.

# బి.సి.లకు ప్రత్యేక మంత్రిత్వ శాఖ ఏర్పాటు చేయాలి

## - ఫిబ్రవరి 6 న ఛలో ఢిల్లీ
## -పోస్టర్ ను విడుదల చేసిన ఆర్.కృష్ణయ్య

హైదరాబాద్ జనవరి 30 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );బి.సి లకు అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికలలో 50 శాతం రిజర్వేషన్లు కల్పించాలని,



బి.సి.లకు ప్రత్యేక మంత్రిత్వ శాఖ ఏర్పాటు చేయాలని, వాఃఅ జాతీయ సెమినార్లు జరపాలని డిమాండ్ చేస్తూ ఫిబ్రవరి 6 మరియు 7న చలో ఢిల్లీ కార్యక్రమం చేపట్టినట్లు రాజ్యసభ జాతీయ బీసీ సంఘం అధ్యక్షులు ఆర్. కృష్ణయ్య తెలిపారు. ఈ కార్యక్రమానికి కార్యక్రమానికి ఆంధ్ర ప్రదేశ్, తెలంగాణ, కర్నాటక, ఒరిస్సా రాష్ట్రాల నుండి పెద్ద యెత్తున పోల్గొంటారని తెలిపారు. ఈ ఛలో డిల్లీ కార్యక్రమానికి సంబందించిన వాల్ పోస్టర్ ను ఆర్. కృష్ణయ్య విడుదల చేశారు. ఈ కార్యక్రమానికి సుగుణవతి, గుజ్జ కృష్ణ అధ్యక్షత వహించారు. ఈ సెమినార్ లో వివిద పార్టీలకు చెందిన పార్లమెంట్ సభ్యులు పాల్గొంటారని తెలిపారు. అన్ని రాజకీయ పార్టీలు బి సి లను ఓటు బ్యాంకు గా వాడుకుంటున్నారు. రాజ్యాధికారంలో వాట ఇవ్వకుండా 76 సం.లుగా అన్యాయం చేస్తున్నారు. జెండాలు మోసుకుంటు, జిందాబాద్ ల నినాదాలు ఇస్తూ బిసిలను వాడుకుంటున్నారని దుయ్యబట్టారు.బిజెపి పార్టీ బీసీ వర్గానికి చెందిన నరేంద్ర మోడీని ప్రధానమంత్రిగా చేశారు. ఇటీవల నలుగురు గవర్నర్లు బి.సి వర్గానికి చెందిన వారిని నియమిం చారు. జాతీయ బీసీ కమిషన్ కు రాజ్యాంగ బద్ధమైన హోదా ఇచ్చారు. కేంద్రంలో బి.సి రిజర్వేషన్లను వర్గీకరించడానికి కమిషన్ ను నియమించాలి. ఇంకా మిగిలింది బీసీలకు చట్టసభల్లో 50 శాతం రిజర్వేషన్లు కల్పించి బీసీలకు సామాజిక న్యాయం కల్పించామన్నారు. కేంద్రంలో బి.సి.లకు ప్రత్యేక మంత్రిత్వ శాఖ పెట్టాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందన్నారు.ఈ సందర్భంగా బి.సి సంక్షేమ సంఘం మహిళా విభాగం జాతీయ ప్రధాన కార్యదర్శిగా చెరుకుల సుగుణవతిని నియమించడం జరిగిందని తెలిపారు. ఈ సమావేశం లో నీలా వెంకటేష్, ,సుదాకర్ ముదిరాజ్,మట్ట జయంతి,వేముల రామకృష్ణ,అనంతయ్య, రాజేందర్,మనికంట,నికిల్, బాల స్వామి తదితరులు పాల్గొన్నారు.

# చోరీలకు పాల్పడుతున్న అంతర్రాష్ట్ర ముఠా అరెస్టు

## -రాచకొండ సీపీ సుధీర్బాబు

హైదరాబాద్, జనవరి 30:దృష్టి మళ్లించి చోరీలకు పాల్పడుతున్న అంతర్రాష్ట్ర దొంగల ముఠాను యాద్రిది భువనగిరి జిల్లా పోలీసులు అరెస్ట్ చేశారు. నిందితుల నుంచి రూ.17 లక్షల విలువైన బంగారు ఆభరణాలను స్వాధీనం చేసుకున్నారు. గురువారం నేరేడ్మెట్లోని రాచకొండ కమిషనరేట్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కమిషనర్ సుధీర్బాబు వివరాలు వెల్లడించారు. భువనగిరి బస్స్టేషన్లో ఈ నెల 21వ తేదీన ఓ మహిళ దృష్టి మళ్లించి ఆమె మెడలో ఉన్న బంగారు చైన్ను గుర్తుతెలియని వ్యక్తులు దోపిడీ చేశారనే ఫిర్యాదుపై భువనగిరి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. దర్యాప్తులో ఈ దొంగల ముఠాపైనా కింద అసలు నోట్లు పెట్టి మధ్యలో కాగితాలతో నోట్ల కట్టలను తయారు చేసి వాటిని అసలు నోట్లుగా నమ్మించే ప్రయత్నం చేస్తారు. మహిళలను మభ్యపెట్టి ఈ నోట్లను చూపిస్తుండగా, మరో గ్యాంగ్ వచ్చి మరో విధంగా మాట్లాడి బాధితులపై వివిధ రకాల ఒత్తిడి పెంచి వారి దృష్టి మళ్లించి వారి వద్ద ఉన్న సొమ్మును దొంగిలించి పరారవుతుంటారు. పోలీసులు ఇదంతా అంతర్రాష్ట్ర ముఠా పని అని భావించి ఆ దిశగా దర్యాప్తు చేపట్టారు.

నగర శివారులో గుండ్లపోచంపల్లిలో గుజరాత్ రాష్ట్రానికి చెందిన గుజరాతి కిషన్ ప్లాస్టిక్ ఫ్లవర్ బిజినెస్ చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. అతడు అదే వ్యాపారం నిర్వహించే ఢిల్లీకి చెందిన రామ్లాల్, శ్యామ్లాల్, కోలీ, మరో జ్యువెనల్లతో పాటు గుల్షన అలియాస్ గుల్ల, దీపక్లతో కలిసి ఒక ముఠాను ఏర్పాటు చేశాడు. ఈ ముఠా బాధితుల వద్దకు వెళ్లినప్పుడు రెండుగా విడిపోతుంది. గుల్షన్, దీపక్లు పరారీలో ఉండగా.. మిగతా నిందితులు పోలీసులకు పట్టుబడ్డారు. వారిని విచారించడంతో భువనగిరిలో నమోదైన కేసుతోపాటు సైబరాబాద్, హైదరాబాద్ కమిషనరేట్ పరిధిలోనూ మరో ఏడు నేరాలు చేసినట్లు ఒప్పుకున్నారు. దీంతో నిందితులను అరెస్ట్ చేసి వారి వద్ద నుంచి 7 బంగారు గొలుసులు 232.75 గ్రాముల బంగారాన్ని స్వాధీనం చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో భువనగిరి డీసీపీ రాజేశ్ చంద్ర, భువనగిరి ఏసీపీ రాహుల్రెడ్డి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

# స్థానిక సంస్థల్లో బీఆర్ఎస్ సత్తా చాటాలి : చిట్టెం రామ్మోహన్రెడ్డి

మక్తల్, జనవరి 30 : రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్ఎస సత్తా చాటాలని మక్తల్ మాజీ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్రెడ్డి పిలుపునిచ్చారు. నారాయణపేట జిల్లా మక్తల్ పట్టణంలోని నేతాజీనగర్లో రామ్మోహన్రెడ్డి సమక్షంలో మున్సిపాలిటీలోని 14వ వార్డుకు చెందిన 30 మంది బీజేపీ కార్యకర్తలు గురువారం బీఆర్ఎస్ పార్టీలో చేరారు. వీరికి పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆయన ఆహ్వానించారు. ఈ సందర్భంగా చిట్టెం మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అరాచక పాలన అందిస్తుందని ధ్వజమెత్తారు.

త్వరలో జరగనున్న లోకల్ బాడీ ఎలక్షన్లలో రేవంత్ సర్కారుకు ఓటుతో బుద్ధి చెప్పాలన్నారు. గులాబీ పార్టీ గెలుపే ధ్యేయంగా పనిచేయాలని కార్యకర్తలకు సూచించారు. బీఆర్ఎస్ శ్రేణులంతా సమిష్టిగా పార్టీ విజయానికి కృషి చేయాలని కోరారు. రాబోయే రోజులన్నీ మనవే అంటూ ధీమా వ్యక్తం చేశారు.

# వృద్ధులకు వైద్యం, ప్రయాణాలలో రాయితీలు కల్పించాలి

హైదరాబాద్ జనవరి 30 (ఎక్స్ ప్రెస్ న్యూస్ ); సీనియర్ సిటిజన్లకు ప్రస్తుతం ఉన్న టికెట్ రాయితీని రైల్వే శాఖ రద్దుచేసింది. కేవలం కింది బెర్త్ మాత్రమే కేటాయిస్తోంది. జనరల్ టికెట్ మినహా స్లీపర్, ఆపై తరగతులకు కనీసం కొంత శాతాన్ని ఇవ్వడం సీనియర్ సిటిజన్లను గౌరవించడమే.కాని 60-70 ఏళ్ల వాళ్ల ప్రయాణాలు తక్కువ ఉంటాయి. 70 దాటితే అవి చాలా అరుదు. వయస్సు మీరిన వారి వల్ల ఉత్పాదక ఉండదనే ఆలోచన సరైనది కాదు. పెన్షనర్లు ప్రభుత్వ సర్వీసులో ఉన్నప్పుడు అన్ని పన్నులు ప్రభుత్వానికి చెల్లించారు. ఇప్పుడు ఆరోగ్య బీమా వంటి పన్నులు చెల్లిస్తున్నారు. ఈ స్థితిలో పెన్షన్ అన్ని అవసరాలకు సరిపోదు. ఈ పరిస్థితులను ప్రభుత్వం వాస్తవ దృష్టితో చూసి, తగిన రక్షణ కల్పించడం భావ్యం. వృద్ధులకు వీలైనంత వరకు వైద్యం, ప్రయాణాలలో ఏదో విధమైన రాయితీ అత్యవసరం.


ఆహ్వానం

## ప్రజాస్వామిక రచయిత్రుల వేదిక

16 వ వార్షిక సదస్సు ✦ బోయి విజయభారతి ప్రాంగణం

### తెలుగు సాహిత్యం - అంబేద్కర్ ప్రభావం

సిద్దిపేట, తెలంగాణ

వేదిక : విపంచి కళానిలయం, తేదీలు 2025 ఫిబ్రవరి 8,9

1891 ఏప్రిల్ 14న పుట్టిన అంబేద్కర్ పాతికేళ్ల వయసుకి కులం పుట్టుకను, వ్యాప్తిని విశ్లేషించటం మొదలుపెట్టాడు. మనుస్మృతి, వేదాలు, పురాణేతిహాసాలు ఆయనకు అధ్యయన విషయాలయ్యాయి. ఈ అధ్యయనం వివక్షలను ఎదిరించి సమానత్వం కోసం పోరాడాలన్న తాత్విక భూమిక మీద సాగింది. అందువల్ల ప్రజాస్వామిక పరిశోధకుడిగా పదును తేలాడు. ఆ రకంగా అంబేద్కర్ ఎంత సామాజిక ఆర్థిక రాజకీయవేత్తో అంత సాహిత్య విమర్శకుడు కూడా. సామాజిక, రాజకీయ ఉద్యమకారులను తన నాయకత్వంతో ప్రభావితం చేసినట్లుగానే సామాజిక చలనాలను ఒడిసి పట్టుకునే సాహిత్యకారులని కూడా తన భావజాలంతో ప్రభావితం చేసాడు. లౌకిక ప్రజాస్వామిక విలువలని- కార్పొరేట్ ఫాసిస్ట్ శక్తులనుంచి కాపాడుకోడానికి కావలసిన నైతిక ధైర్యాన్ని పోగుచేసుకొనటానికి అంబేద్కర్ ఆలోచనలు ఉపయోగపడతాయన్న నమ్మకంతో ప్రజాస్వామిక రచయిత్రుల వేదిక అంబేద్కర్ రచనల అధ్యయనం మొదలుపెట్టింది. డిసెంబర్ 22 నుండి ప్రతి ఆదివారం 'అంబేద్కర్ ఆలోచనల తాత్వికత'పై రెండు ప్రసంగాలతో అంతర్జాల కార్యక్రమం ప్రారంభించింది. ఇది 2025 జూన్ వరకూ సాగుతుంది. ఈ ప్రయత్నం మరింత సమగ్రం కావడం కోసం ప్రరవే 16 వ వార్షిక సదస్సు 'తెలుగు సాహిత్యం - అంబేద్కర్ ప్రభావం' అన్న అంశాన్ని ఎంచుకుంది. 2025 ఫిబ్రవరి 8, 9 (శని, ఆదివారాలు) తారీకులలో సిద్దిపేటలో జరగనున్న రెండురోజుల సదస్సులో ఈ క్రింది అంశాలు చర్చకు రావాలని ప్రరవే ఆశిస్తున్నది.

● దళిత స్పృహతో- దళితులు, దళితేతరులు రాసిన సాహిత్యాన్ని విశ్లేషించే పద్ధతులు ● దళిత సాహిత్యం అంతా అంబేద్కరిస్టు సాహిత్యం అవుతుందా అన్న చర్చ ● అంబేద్కరిస్టు సాహిత్యాన్ని నిర్వచించటం, గుర్తించటం ●1985కు ముందు తెలుగు సాహిత్యంపై అంబేద్కర్ ప్రభావం ● 1985 తరువాత వచ్చిన గుణాత్మక పరిణామాలు ● అంబేద్కర్పై వచ్చిన ఆరాధనా సాహిత్యంలో అంబేద్కర్ భావజాల ప్రభావం ● కుల, మత, మానవ సంబంధాల నేపథ్యంగా అంబేద్కర్ ప్రభావంతో వచ్చిన సాహిత్యం- ఏ కాలంలో, ఏ ప్రక్రియలో, ఎంత విస్తారంగా వచ్చింది. ● మహిళా జనహితం కోసం పాటుబడిన అంబేద్కర్ ఆలోచనాధారను స్త్రీలు ఏ మేరకు అందిపుచ్చుకుని ఏయే ప్రక్రియలలో ప్రధానంగా కృషి చేశారు.

మొత్తంగా అంబేద్కర్ ప్రభావం తెలుగుసాహిత్యానికి ఇచ్చిన కొత్త విలువలను కేంద్రంగా చేసుకొని ప్రారంభ, ముగింపు సమావేశాలుకాక మూడు సమావేశాలలో ఆరుగురు వక్తలు మాట్లాడతారు. అంబేద్కర్ ప్రభావంతో తెలుగు సాహిత్య విమర్శను అభివృద్ధిచేసిన బోయి విజయభారతి స్మారకోపన్యాసం, అంబేద్కర్ ఆలోచనల స్ఫూర్తి కవిసమ్మేళనం జరగనున్నాయి. సిద్దిపేటలో 2025 ఫిబ్రవరి 8, 9 తేదీలలో జరగనున్న ప్రరవే 16 వ వార్షికసదస్సుకు సాహిత్యకారులు, అంబేద్కర్వాదులు, సమానత్వకాంక్షతో పోరాటాలు చేస్తున్న అందరూ అధికసంఖ్యలో హాజరయి సభలని విజయవంతం చేయమని కోరుతున్నాం.

✦ ప్రజాస్వామిక రచయిత్రుల వేదిక

# శ్రవ్యమైన బీటింగ్ రిట్రీట్.. పులకించిన విజయ్ చౌక్...

న్యూఢిల్లీ, జనవరి 30:రాయిసీనా హిల్స్ మీదుగా అస్తమించే సూర్యుడి భవ్య నేపథ్యంలో... భారత 76వ గణతంత్ర దినోత్సవాల ముగింపును సూచించే బీటింగ్ రిట్రీట్ వేడుక సందర్భంగా తీయనైన భారతీయ రాగాలావన జడివానలో తడిసిముద్దవడానికి విజయ్ చౌక్ సన్నద్ధమైంది. భారతీయ సైన్యం (ఐఏ), భారతీయ నౌకాదళం (ఐఎన్), భారతీయ వైమానిక దళం (ఐఏఎఫ్)లతోపాటు కేంద్ర సాయుధ పోలీసు బలగాల (సెంట్రల్ ఆర్మ్‌డ్ పోలీస్ ఫోర్సెస్-సీఏపీఎఫ్) బ్యాండ్ మేళం బృందాలు ? కవాతు నేపథ్యంలో 30 భారతీయ రాగాలను ఆలపించనున్నాయి. శ్రోతల్లో రాష్ట్రపతి శ్రీమతి ద్రౌపది ముర్ము, ఉపరాష్ట్రపతి శ్రీ జగ్‌దీప్ ధన్‌ఖడ్, ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ, రక్షణ మంత్రి శ్రీ రాజ్‌నాథ్ సింగ్, ఇతర కేంద్ర మంత్రులు, ఉన్నతాధికారులతోపాటు ప్రజలు కూడా ఈ కార్యక్రమంలో భాగం కానున్నారు.

'కదం కదం బఢాయె జా' (అడుగులో అడుగేస్తూ సాగి పో..) స్వరాన్ని అన్ని బ్యాండ్లూ కలసి వినిపించడంతో ఈ వేడుకను ప్రారంభిస్తారు.

దాని తరువాత 'అమర్ భారతీ', 'ఇంద్ర ధనుష్', 'జై జనం భూమీ', 'నాటీ ఇన్ హిమాలయన్ వేలీ', 'గంగా జమునా'లతోపాటు 'వీర్ సియాచిన్' వంటి మనోహర బాణీలను వినిపించనున్నారు.

సీఏపీఎఫ్ బ్యాండు 'విజయ్ భారత్', 'రాజస్థాన్ ట్రూప్స్', 'ఏ వతన్ తేరే లియే', ఇంకా 'భారత్ కే జవాన్' పాటలను ఆలపిస్తారు.

వైమానిక దళం బ్యాండేమో 'గేలెక్సీ రైడర్', 'స్ట్రయిడ్', 'మిలీనియమ్ ఫ్లైట్ ఫాంటసీ' వంటి స్వరాలను వినిపిస్తుంది. ఇక నౌకాదళ బ్యాండు తన వంతుగా 'రాష్ట్రీయ ప్రథమ్', 'నిషక్ నిష్పద్', 'ఆత్మనిర్భర్ భారత్', 'స్వతంత్రతా కా ప్రకాశ్ ఫైలావో', 'రిదమ్ ఆఫ్ ద రీఫ్'లతోపాటు 'జయ్ భారతీ'లను అందించనున్నది. దీని తరువాత వైమానిక దళం బ్యాండు 'వీర్ సపూత్', 'తాకత్ వతన్', 'మేరా యువ భారత్', 'ధ్రువ్'లతోపాటు 'ఫౌలాద్ కా జిగర్'లతో అలరించనున్నది.

అనంతరం, సామూహిక బ్యాండు 'ప్రియం భారతమ్', 'ఏ మేరే వతన్ కె లోగోం'లను, ఇంకా 'డ్రమర్స్ కాల్' ధ్వనులను మోగించనుంది. కార్యక్రమంలో ఆఖరున బగ్లర్లు నిత్యనూతన జనప్రియ గీతం 'సారే జహాం సె అచ్ఛా'ను వినిపిస్తారు.

కార్యక్రమానికి ముఖ్య నిర్వాహకునిగా కమాండర్ మనోజ్ సెబాస్టియన్ ఉంటారు. వైమానిక దళ బ్యాండు సంచాలకుడు సుబేదార్ మేజర్ (గౌరవనీయ కెప్టెన్) బిశ్వ బహాదుర్ వ్యవహరిస్తారు. అలాగే భారతీయ సైన్యం (ఐఏ) బ్యాండు కండక్టర్‌గా ఎం. ఆంటోనీ ఎంసీపీఓ ఎంయూఎస్ ఎ, భారత వైమానిక దళం (ఐఏఎఫ్) బ్యాండు కండక్టర్‌గా వారంట్ ఆఫీసర్ అశోక్ కుమార్ వ్యవహరిస్తారు. సెంట్రల్ ఆర్మ్‌డ్ పోలీస్ ఫోర్సెస్ (సీఏపీఎఫ్) బ్యాండు నిర్వాహకునిగా హెడ్ కానిస్టేబుల్ జీడీ మహాజన్ కైలాష్ మాధవ్ రావ్ ఉంటారు.

పైప్స్ అండ్ డ్రమ్స్ బ్యాండ్ సభ్యులు సుబేదార్ మేజర్ అభిలాష్ సింగ్ సూచనలకు కళాకారులు అనుసరిస్తారు. బగ్లర్లు నాయబ్ సుబేదార్ భూపాల్ సింగ్ నాయకత్వంలో తమ ప్రతిభను చాటనున్నారు.

# మహాకుంభ్ 2025: ప్రభుత్వ కార్యక్రమాలు 'భిన్నత్వంలో ఏకత్వం' సందేశాన్ని ఎలా వ్యాప్తి చేస్తున్నాయో ప్రధానంగా చెబుతున్న ప్రయాగ్‌రాజ్ లోని డిజిటల్ ఎగ్జిబిషన్





న్యూఢిల్లీ, జనవరి 30:కేంద్ర ప్రభుత్వం అమలుచేస్తున్న అనేక కార్యక్రమాల ద్వారా 'భిన్నత్వంలో ఏకత్వం' సందేశాన్ని ప్రధానంగా చాటిచెబుతూ, సమాచార- ప్రసార మంత్రిత్వ శాఖ ప్రయాగ్‌రాజ్‌లోని 'మహాకుంభ్ 2025'లో ఏర్పాటు చేసిన ఒక డిజిటల్ ఎగ్జిబిషన్ అశేష జనాన్ని విశేషంగా ఆకట్టుకొంటోంది.

'వన్ నేషన్, వన్ ట్యాక్స్' (ఒకే దేశం, ఒకే తరహా పన్ను), 'వన్ నేషన్, వన్ పవర్ గ్రిడ్' (ఒకే దేశం, ఒకే విద్యుత్తు గ్రిడ్), ఇంకా 'వన్ నేషన్, వన్ రేషన్ కార్డ్' (ఒకే దేశం, ఒకే రేషన్ కార్డు) మొదలైన కార్యక్రమాల ద్వారా సందర్శకులలో "ఐక్యం బలం సామంజస్యం" పదబంధ స్ఫూర్తిని నింపే ప్రయత్నం చేస్తున్నారు. దేశంలో ఐకమత్యాన్ని బలపరుస్తున్న ఈ కార్యక్రమాలను గురించి ప్రయాగ్‌రాజ్‌లో మహాకుంభ్ నగరం త్రివేణి మార్గ్‌లో కేంద్ర సమాచార- ప్రసార శాఖ ఏర్పాటు చేసిన డిజిటల్ ఎగ్జిబిషనుకు వెల్లువెత్తుతున్న సందర్శకులకు తెలియజేస్తున్నారు. జాతీయ సమైక్యతకు ప్రతీకగా నిలచే సర్దార్ పటేల్ విగ్రహంతో ఉన్న ఒక చిత్రం కూడా ఐక్యతా సందేశాన్ని చాటిచెబుతోంది.

జమ్మూ కాశ్మీర్‌లో 370వ అధికరణాన్ని తొలగించడంతో 'వన్ నేషన్, వన్ కాన్‌స్టిట్యూషన్' (ఒకే దేశం, ఒకే రాజ్యాంగం) ప్రతినను నెరవేర్చినట్లయింది. అభివృద్ధి చెందిన భారతదేశం కలను పండించే దిశగా 'వన్ నేషన్, వన్ ఎలక్షన్' (ఒకే దేశం, దేశమంతటా ఒకేసారి ఎన్నికలు)తోపాటు 'వన్ నేషన్, వన్ సివిల్ కోడ్' (ఒకే దేశం, ఒకే పౌర స్మృతి)లను ఆవిష్కరించడానికి ప్రయత్నాలు జోరందుకొంటున్నాయి. ఈ అంశాలను సైతం మహాకుంభ్ సందర్భంగా ఏర్పాటు చేసిన ప్రదర్శనలో ఆకర్షణీయ తీరులో కళ్లకు కడుతున్నారు.

ప్రజాసంక్షేమ కార్యక్రమాలు, విధానాలు, కేంద్ర ప్రభుత్వం సాధించిన విజయాల గురించి తెలియజేస్తున్న ఈ ప్రదర్శన ముఖ్యంగా ఔత్సాహిక పారిశ్రామికత్వాన్ని గురించి, స్వయం- ఉపాధి మార్గాలను గురించి ప్రచారం చేస్తోంది. 'ముద్ర పథకం', ప్రధాన మంత్రి విశ్వకర్మ యోజన, ప్రధాన మంత్రి ఉపాధి కల్పన కార్యక్రమం (పీఎంఈజీపీ)లతోపాటు క్రెడిట్ గ్యారంటీ ఫండ్ స్కీములు ఈ ప్రచారంలో భాగంగా ఉన్నాయి.

ఈ నెల 13న ఈ ప్రదర్శనను మొదలుపెట్టినప్పటి నుంచి దీనిని భక్తజనం పెద్ద సంఖ్యలో చూశారు. దృశ్య, శ్రవణ మాధ్యమాల సాయంతో వారు దేశాభివృద్ధి తీరుతెన్నులను గురించి, వారసత్వాన్ని గురించి అనేక విషయాలను తెలుసుకొంటున్నారు. వేరు వేరు ప్రభుత్వ పథకాలను వివరించే డాక్యుమెంటరీలను ఎగ్జిబిషన్‌లో ఎల్ఈడీ తెరపై ప్రదర్శిస్తున్నారు. వీటిని చూడడానికి చాలా మంది ఆసక్తిని కనబరుస్తున్నారు. అంతేకాకుండా ఆ తెర పక్కన నిల్చొని వారు తమ సెల్ఫీలను (స్వీయ ఛాయాచిత్రాలను) కూడా తీసుకొంటున్నారు.

# విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ ప్రసక్తే లేదు.. పునరుద్ధరణకే ప్రాధాన్యం : కేంద్ర మంత్రి కుమారస్వామి



అమరావతి, జనవరి 30:విశాఖ ఉక్కు - ఆంధ్రుల హక్కు అనే నినాదంతో ఏర్పడ్డ విశాఖ స్టీల్ ప్లాంట్‌ను ఎట్టి పరిస్థితుల్లోనూ ప్రైవేటీకరణ జరుగదని కేంద్ర ఉక్కు గనులశాఖ మంత్రి కుమారస్వామి మరోసారి స్పష్టం చేశారు. ప్లాంట్‌ను పునరుద్ధరించడమే ధ్యేయంగా ముందుకు వెళ్తున్నామని వెల్లడించారు.

ఇటీవల కేంద్రం విశాఖ స్టీల్‌కు ప్యాకేజీ ప్రకటించిన అనంతరం తొలిసారిగా విశాఖకు వచ్చిన మంత్రి కుమారస్వామితో పాటు మరో మంత్రి శ్రీనివాస వర్మకు ఎంపీలు, ఎమ్మెల్యేలు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఎయిర్‌పోర్టు నుంచి ర్యాలీని నిర్వహించారు. అనంతరం ఇద్దరు మంత్రులు, ఎంపీలు విశాఖ స్టీల్ ప్లాంట్‌ను సందర్శించారు.

దాదాపు నాలుగు గంటలకు పైగా సంబంధిత అధికారులు, కార్మికులు, ఉద్యోగులతో సమావేశం నిర్వహించి ప్యాకేజీతో ప్లాంట్ సమర్ధ నిర్వహణ అనే అంశాలపై సుదీర్ఘంగా చర్చించారు. అనంతరం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మంత్రి కుమార స్వామి మాట్లాడారు.

2030లోపు విశాఖ ప్లాంట్ 300 మిలియన్ టన్నుల స్టీల్ ఉత్పత్తి సాధించాలని ప్రధాని నరేంద్ర మోదీ తమకు లక్ష్యంగా నిర్దేశించారని వివరించారు. ప్రస్తుతం 35వేల కోట్ల అప్పులుగా ఉన్న ప్లాంట్‌ను పరిరక్షించేందుకు తాము అధికారంలోకి రాగానే రెండు విడతలుగా ఆర్థిక సహాయం అందజేసామన్నారు. జులైలో ప్లాంట్‌ను సందర్శించిన తరువాత ప్లాంట్‌ను ప్రైవేటీకరణ చేయడం లేదని, పునరుద్దరించడానికి చర్యలు తీసుకుంటామన్న హామీకి కట్టుబడి ఉన్నామని చెప్పారు.


## రూ. 11,440 కోట్లు ప్యాకేజీ

మొదటి, రెండు విడతలుగా విడుదల చేసిన నిధులతో బ్లాస్ట్ ఫర్నేస్ మొదలు పెట్టాం , దీంతో ఉద్యోగులు, కార్మికులు సమర్దవంతంగా పనిచేయడంతో కేంద్రం మరో రూ. 11,440 కోట్లు ప్యాకేజీ ఇచ్చింది. ఇచ్చిన నిధులను ఏ విధంగా ఖర్చు చేసి స్టీల్ ప్లాంట్‌ను ముందుకు తీసుకెళ్లడానికి గురువారం సందర్శించామని తెలిపారు. వచ్చే జూన్, జులైలో మూడో బ్లాస్ట్ ఫర్నేస్‌ను ప్రారంభించడానికి చర్యలు తీసుకుంటామని తెలిపారు.

## కార్మికుల ప్రయోజనాలకు ఎలాంటి భంగం కలిగించబోం

ఈ సంవత్సరాంతంలోగా ప్లాంట్‌ను పూర్తిస్థాయిలో నడిపేందుకు అన్ని చర్యలు తీసుకుంటామని వెల్లడించారు. కార్మికుల ప్రయోజనాలకు ఎలాంటి భంగం కలిగించబోమని అన్నారు. ప్లాంట్‌ను ఎలాగైనా పరిరక్షించడమే లక్ష్యంగా ముందుకు వెళ్తున్నామని అన్నారు. సెయిల్‌లో కలపడమా, ప్రభుత్వ పరంగా నడపడమా అనేది భవిష్యత్‌లో తెలుస్తుందని అన్నారు.

# తిరుమలను దర్శించుకున్న మాజీ గవర్నర్ విద్యాసాగర్‌రావు



తిరుపతి, జనవరి 30: మహారాష్ట్ర మాజీ గవర్నర్ విద్యాసాగర్‌రావు తిరుమలలో శ్రీవారిని దర్శించుకున్నారు. గురువారం ఉదయం దర్శనానికి వచ్చిన సందర్భంగా ఆలయ అర్చకులు ఆయనకు స్వాగతం పలికారు. స్వామివారి దర్శన అనంతరం రంగనాయకుల మండపంలో అర్చకులు, ఆలయ అధికారులు తీర్థప్రసాదాలు అందజేసి, శాలువతో సన్మానించారు.

తిరుపతికి చెందిన బ్లిస్ హోటల్స్ గ్రూప్ చైర్మన్ ఎం. సూర్యనారాయణ రెడ్డి దంపతులు టీటీడీ ఎస్వీ సర్వ శ్రేయాస్ ట్రస్ట్ కు రూ.10,00,116 విరాళాన్ని గురువారం అందించారు. ఈ సందర్భంగా చెక్‌ను టీటీడీ అదనపు ఈవోసిహెచ్ వెంకయ్య చౌదరి కి తిరుమలలోని అడిషనల్ ఈవో క్యాంపు కార్యాలయంలో అందజేశారు. ఈ కార్యక్రమంలో టీటీడీ బోర్డు సభ్యులు జి.భానుప్రకాష్ రెడ్డి పాల్గొన్నారు.

# రేవంత్ రెడ్డి మీద హరీష్ రావు విమర్శలు చేస్తే సూర్యుడి మీద ఉమ్మేసినట్లే

## -టిపిసిసి మీడియా కమిటీ చైర్మన్ సామ రామ్మోహన్ రెడ్డి

హైదరాబాద్ జనవరి 30 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );సీఎంను ఉద్దేశించి కమాండ్ కంట్రోల్ సెంటర్, సీఎం తన ప్యాలెస్ నుంచి పాలన చేస్తూ సమీక్షలు నిర్వహిస్తున్నారాని హరీష్ రావు మాట్లాడటాన్ని టిపిసిసి మీడియా కమిటీ చైర్మన్ సామ రామ్మోహన్ రెడ్డి తప్పుబట్టారు. ప్రజల ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మీద హరీష్ రావు విమర్శలు చేస్తే సూర్యుడి మీద ఉమ్మేసినట్లే నన్నారు..గతంలో ఉన్న ఐ ఏ ఎస్ అధికారుల నివాస సముదాయాలను కూల్చి ప్యాలెస్ కట్టుకుంది కేసీఆర్ ప్యాలెస్ సీఎం ఎవరు అంటే ప్రజలే చెబుతారు.ప్రజల సీఎం రేవంత్ రెడ్డి తన నివాసం నుంచి సమీక్ష చేస్తే తప్పుఎంటి అని ప్రశ్నించారు.. క్యాబినెట్ సమావేశాలు,పాలన పరమైన నిర్ణయాలు సచివాలయం నుంచి జరుగుతున్నాయి.గతంలో కేసీఆర్ మాట్లాడుతూ సీఎం ఎక్కడ కూర్చుంటే అదే సచివాలయం అన్న మాటలు వింటే హరీష్ రావుకి అర్ధం అవుతుంది.సీఎం రేవంత్ రెడ్డి ఉదయం ఎనిమిది గంటల నుంచి సమీక్షలు చేస్తున్న ట్రాక్ రికార్డు మాది.సీఎం ఇంటి దగ్గర కిలో మీటర్ల దూరంలో జనాన్ని అపుతున్నారని హరీష్ రావు అంటున్నారు. కిలో మీటర్లకు.. మీటర్లకు కన్ఫ్యూజ్ అయినట్లు ఉన్నావ్.హరీష్ రావు ఎప్పుడూ వస్తారో రండి నేను తీసుకుపోతా.. చూపిస్తా. కంచెలు పెట్టి గేటు బయట గద్దర్ నీ గంటల కొద్దీ ఆపి వెనక్కి పంపినప్పుడు.. మైనారిటీ మంత్రి మహ్మద్ అలీ నీ హోంగార్డులతో ఆపించి వెనక్కి పంపించిన మీ ప్యాలెస్ పాలనను ప్రజలు మరిచిపోలేదు.కేసీఆర్ తన ఫామ్ హౌస్ చుట్టూ పొలానికి వేసుకునే కడీల మాదిరి పోలీసుల పహరా ఉండేది.ఫాం హౌస్ చుట్టూ ఉన్న ఊర్ల జనం ఊర్లోకి రావాలంటే ఐడి కార్డులు చూపించే రాచరికపు పరిస్తితి ఉండేది.ఇజ్రాయిల్, పాలస్తీనా లాంటి దేశాల్లో బరికెట్ల మాదిరి పోలీసుల పహరా ఉండేది.కేసీఆర్ ను ప్యాలెస్ లాంటి తన ఫాం హౌస్ నుంచి ప్రజల్లోకి తీసుకు వచ్చే బాధ్యత హరీష్ రావు తీసుకోవాలి.పిచ్చి విమర్శలు వదిలి ప్రజల కోసం నిజంగా పాటు పడాలని రామ్మోహన్ రెడ్డి విజ్ఞప్తి చేసారు.

# గోబెల్స్ సిగ్గుపడేలా కాంగ్రెస్ అబద్దాలు : ఎమ్మెల్యే జగదీష్ రెడ్డి

నల్లగొండ : రాష్ట్రంలో అధికారంలోకి రావడానికి కాంగ్రెస్ పార్టీ ఎన్నో అలవిగాని హామీలను ఇచ్చి తెలంగాణ ప్రజలను మోసం చేసిందని మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే జగదీశ్వర్ రెడ్డిన్నారు. బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపు మేరకు దేవరకొండ బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో గాంధీజీ విగ్రహానికి వినత వత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆరు గ్యారంటీల పేరుతో 420 బూటకపు హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిందని గుర్తు చేశారు. వంద రోజుల్లో ఇచ్చిన హామీలను అమలు చేస్తామని చెప్పి.. 420 రోజులైనా హామీలు అమలు చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని విమర్శించారు.

బీఆర్ఎస్ ప్రభుత్వం ఒక్క రేషన్ కార్డు కూడా ఇవ్వలేదంటూ అబద్ధాలు చెబుతున్నారు. 2021లోనే మా కేసీఆర్ ప్రభుత్వం ఇచ్చిన రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమంలో మీ బట్టి విక్రమార్క పాల్గొన్నారని తెలిపారు. కేసీఆర్ మానవతా దృక్పథంతో ఆలోచించి ప్రతి నిరుపేదకు రేషన్ కార్డులు రావాలనే ఆలోచనతో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ఉన్న ఆదాయ పరిమితిని సడలించారని పేర్కొన్నా రు. రేషన్ కార్డులు జారీ కూడా ఏదో చారిత్రాత్మక కార్యక్రమమని ఎన్నడూ చెప్పుకోలేదని తెలిపారు. కానీ, రేషన్ కార్డులు ఇచ్చే కార్యక్రమాన్ని కూడా చారిత్రాత్మ కమైన కార్యక్రమం అంటున్న ముఖ్యమంత్రి భావదారిద్ర్యాన్ని తెలంగాణ ప్రజలు గమనిస్తున్నారని పేర్కొన్నారు.

గోబెల్స్ సిగ్గుపడేలా కాంగ్రెస్ అబద్దాలను ప్రచారం చేసిందని విమర్శించారు. తెలంగాణ యువతకు రెండు లక్షల ప్రభుత్వ ఉద్యోగాలు ఇప్పిస్తామని చెప్పి రాహుల్ గాంధీ మొహం చాటేసారు. మా ప్రభుత్వం అధికా రంలో ఉన్నప్పుడు 2 లక్షలకు పైగా ఉద్యోగాలు ఇచ్చామన్నారు. కరోనా సమయంలో కూడా రైతు బంధు క్రమం తప్పకుండా వేసిన ఘనత కేసీఆర్ ప్రభుత్వానిది అని గుర్తు చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలో వచ్చాక 412 మంది రైతులు ఆత్మహత్యలు చేసుకున్నారు. అని తెలిపారు. సుమారు 100 మందికి పైగా ఆటో డ్రైవర్లు ఆత్మహత్యలు చేసుకున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

# ఇందిరమ్మ ఇళ్ల పై ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలి

-అరుగులైన పేదలందరికీ సంక్షేమ పథకాలు అందాలి.
-స్వంత స్థలం లేని నిరుపేదలకు ఇళ్లను ఎలా కేటాయిస్తారు.
-ఎలక్షన్ కోడ్ సాకుతో రైతు భరోసా నిలిపివస్తే సహించం.
- బీజేఎల్పీ నేత ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి.

నిర్మల్ జనవరి 30 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );:అర్హులైన నిరుపేదలందరికి సంక్షేమ పథకాలు అందజేయాలి అని బీజేఎల్పీ నేత ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి గురువారం నిర్వహించిన



మీడియా సమావేశంలో అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అన్ని వర్గాల ప్రజలను మోసం చేసింద న్నారు. ఎన్నికల్లో ఇచ్చిన 420 హామీలను అమలు వరచడంలో ప్రభు త్వం విఫలమైందన్నారు. జిల్లాలో ఇల్లు లేని పేదలు 1లక్ష 90వేల దరఖాస్తులు వస్తే నియోజక వర్గం నుండి సుమారు 70 వెలకు పైగా దరఖాస్తులు వస్తే కేవలం 3500 ఇల్లు కేటాయించడం ఏంటని ప్రశ్నించారు. అర్హులను ఎలా గుర్తిస్తా రు, దానికి సంబంధించిన పూర్తి ప్రణాలికను ప్రజలకు తెలియజేయాల్సిన అవసరం ఉంది, రేషన్ కార్డు జారీలపై కూడా స్పష్టత ఇవ్వాలనీ డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా బీజేపీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# రోడ్డు భద్రతా నియమాలు పాటించాలి

## -అవగాహన సదస్సులో రాచకొండ సీపీ సుధీర్‌బాబు

హైదరాబాద్, జనవరి 30:ప్రతిఒక్కరూ రోడ్డు భద్రతా నియమాలు పాటించి ప్రమాదాలను అరికట్టాలని రాచకొండ పోలీసు కమిషనర్ సుధీర్‌బాబు తెలిపారు. ఘట్‌కేసర్ పోలీస్‌స్టేషన్ పరిధి అంకుషాపూర్‌లోని ఏసీఈ ఇంజినీరింగ్ కళాశాలలో రాచకొండ సీపీ సుధీర్‌బాబు నేతృత్వంలో రాచకొండ భద్రతా మండలి సహకారంతో జాతీయ రోడ్డు భద్రతా మాసోత్సవాల్లో భాగంగా బుధవారం రోడ్డు భద్రత అవగాహన సదస్సు జరిగింది. ఈ సదస్సులో ఏసీఈ ఇంజినీరింగ్ కళాశాలతోపాటు విజ్ఞాన్ మహిళా ఇంజినీరింగ్ కళాశాల, సంస్కృతి ఇంజినీరింగ్ కళాశాలల విద్యార్థులు, బస్సు డ్రైవర్లు, ఆటోడ్రైవర్లు, శ్రీనివాస టూర్స్ అండ్ ట్రావెల్స్ చెందిన డ్రైవర్లు రోడ్డు భద్రతా శిక్షణ అవగాహన సదస్సులో పాల్గొన్నారు.

విద్యార్థులు డ్రైవింగ్ చేసేటప్పుడు రోడ్డు భద్రతా నియమాలు పాటించాలన్నారు. వేగానికి సంబంధించిన ప్రమాదాల ప్రభావాన్ని తగ్గించడానికి సమర్థవంతమైన వేగ నియంత్రణ చర్యలు తీసుకోవాన్నారు. సీట్ బెల్టు, హెల్మెట్ ధరించడం వల్ల ప్రమాదాలు జరిగినా ప్రాణనష్టం ఉండదన్నారు. మద్యం మత్తులో డ్రైవింగ్ చేయడం వల్ల ప్రమాదాలు జరిగే అవకాశాలు ఎక్కువగా ఉంటాయన్నారు. ట్రాఫిక్ నిబంధనలను పాటించడం వల్ల వాహనాలు నడిపే వారు, రోడ్డుపై వెళ్లే వారు క్షేమంగా ఉంటారని చెప్పారు.

ప్రమాదాలను నివారించడంలో పోలీసులకు మద్దతు ఇస్తూ ట్రాఫిక్ యోధులుగా ప్రతిఒక్కరూ మారాలని సూచించారు. రోడ్డు భద్రత నియమాలు ఉల్లంఘిస్తే చర్యలు కఠినంగా ఉంటాయని హెచ్చరించారు. రహదారి భద్రతా నిబంధనలకు కట్టుబడి ఉంటామని ప్రతి ఒక్కరితో ప్రతిజ్ఞ చేయించారు. ట్రాఫిక్ మార్షల్స్ యొక్క స్వచ్ఛంద సేవలను ఆయన ప్రశంసించారు. ఈ సందర్భంగా రోడ్డు ప్రమాదాల్లో కుటుంబసభ్యులను కోల్పోయిన బాధితులతో మాట్లాడించారు. డీసీపీలు కె.మనోహర్, మల్లారెడ్డి, శ్రీనివాసులు మాట్లాడుతూ.. ప్రమాద నివారణపై పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో చీఫ్ కోఆర్డినేటర్ ఎంఎస్. సావిత్రి ముథయాలా, రోడ్ సేఫ్టీ కోఆర్డినేటర్ ఎం.ఆర్.రాజేశ్, జగన్ యాదవ్, సూర్యనారాయణ, మల్కాజిగిరి ఏసీపీ చక్రపాణి, ఇన్‌స్పెక్టర్లు పరశురాం, రాజువర్మ తదితరులు పాల్గొన్నారు.

# తహసీల్దార్‌గా బాధ్యతలు స్వీకరించిన సుజాత రెడ్డి




ఖానాపూర్ టౌన్, జనవరి30: ఖానాపూం తహసీల్దారుగా సుజాత రెడగురువారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ తహసీల్దారుగా పనిచేసిన మామిడి శివరాజ్ నిర్మల్ జిల్లా కలెక్టర్ కార్యాలయానికి బదిలీపై వెళ్లారు. కడెం తహసీల్దారుగా పని చేసిన సుజాత రెడ్డి బదిలీపై ఇక్కడకు వచ్చారు. ఇక్కడ విధులు నిర్వహిస్తున్న మామిడి శివరాజ్.. సుజాత రెడ్డికి బాధ్యతలు అప్పగిం చారు. ఈ సందర్భంగా కార్యాలయ సిబ్బంది నూతన తహసిల్దార్‌కు స్వా గతం పలికి శుభాకాంక్షలు తెలియ జేశారు. ప్రజలకు అందుబా టులో ఉండి వారి సమస్యలను సకాలంలో పరిష్కరించేందుకు కృషి చేస్తానని ఆమె తెలిపారు. జిల్లాలో నలుగురు తాసిల్దారులను బదిలీ చేస్తూ నిర్మల్ జిల్లా కలెక్టర్ సోమవారం రాత్రి ఉత్తర్వులు జారీ చేసిన విషయం తెలిసిందే.

# 7 నుంచి 5వేల రూపాయలకు తగ్గిన పత్తి ధర.. ధర్నాకు దిగిన రైతులు



కరీంనగర్, జనవరి 30::పెద్దపల్లి జిల్లా కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్ యార్డులో పత్తి ధర అమాంతం పడిపోయింది. నిన్న మొన్నటి వరకు క్వింటాలకు రూ. 7వేల వరకు ధర పలికిన పత్తి గురువారం కేవలం రూ. 5వేలకే అమ్ముడు పోయింది. నిన్న అమావాస్య కావటంతో క్రయ విక్రయాలు జరగ లేదు. ఈ రోజు దాదాపుగా 1500క్వింటాళ్ళ పత్తి రావటం తో ఒక్కసారి రూ. 2వేలు తగ్గించారని రైతులు మండి పడుతున్నారు.

ఈ సీజన్ లో ఈ రోజు ఎక్కువ పత్తి రావటంతో అదును చూసి ధర తగ్గించారని రైతులు ఆరోపించారు. పెద్దపల్లి మార్కెట్ కమిటీ చైర్మన్, మార్కెట్ కమిటీ సిబ్బంది, అడితీ దారులు మొత్తం కుమ్మకై నిలువునా ముంచుతున్నారని ఆరోపిస్తూ ఆందోళనకు దిగారు.

తమ దగ్గర తక్కువ ధరకు పత్తిని కొనుగోలు చేసి సీసీఐకి ఎక్కువ ధరకు అధికారులు అమ్ముకుంటున్నారని రైతులు ఆరోపించారు.

# రూ. 34,300 కోట్లతో ఏడేళ్ల కాలానికి 'జాతీయ కీలక ఖనిజాల మిషన్'ను ఆమోదించిన క్యాబినెట్..

న్యూఢిల్లీ, జనవరి 30:ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ అధ్యక్షతన సమావేశమైన కేంద్ర మంత్రి మండలి రూ. 16,300 కోట్ల వ్యయంతో జాతీయ కీలక ఖనిజాల మిషన్ (ఎన్ సీఎంఎం)ను ప్రారంభించడానికి ఆమోదం తెలిపింది. ప్రభుత్వ రంగం.. మరి ఇతర సంస్థల ద్వారా రూ. 18,000 కోట్ల పెట్టుబడులు వస్తాయని అంచనా.

ఆత్మనిర్భర భారత్ లో భాగంగా.. ఉన్నత సాంకేతిక పరిశ్రమలు, హరిత ఇంధనం, రక్షణ రంగాల్లో ఈ ఖనిజాల అనివార్యతను గుర్తించిన కేంద్ర ప్రభుత్వం కీలక ఖనిజాల రంగంలో సవాళ్ల పరిష్కారం కోసం రెండేళ్లుగా వివిధ కార్యక్రమాలను చేపట్టింది.

కీలక ఖనిజాల రంగంలో భారత్ స్వావలంబన సాధించడం కోసం ఒక ప్రభావవంతమైన వ్యవస్థను ఏర్పాటు చేయాల్సిన ఆవశ్యకత ఉంది. దీనికి అనుగుణంగా గతేడాది జూలై 23న కేంద్ర బడ్జెట్ లో కీలక ఖనిజాల మిషన్ ను ఏర్పాటు చేస్తున్నట్లు ఆర్థిక మంత్రి ప్రకటించారు.

ఖనిజాన్వేషణ, తవ్వకం, మలినాల తొలగింపు, శుద్ధి, కాలం చెల్లిన ఉత్పత్తుల పునరుద్ధరణ సహా విలువ ఆధారిత వ్యవస్థలోని అన్ని దశలూ కేంద్ర మంత్రివర్గం ఆమోదించిన కీలక ఖనిజాల మిషన్ లో ఉంటాయి. దేశంలోను, తీరప్రాంతాల్లోనూ కీలక ఖనిజాల అన్వేషణను ఈ మిషన్ ముమ్మరం చేస్తుంది. ఆయా ఖనిజాల మైనింగ్ ప్రాజెక్టుల నియంత్రణా పరమైన ఆమోద ప్రక్రియ త్వరితగతిన పూర్తయ్యేలా చూడడం దీని లక్ష్యం. అంతేకాకుండా కీలక ఖనిజాల అన్వేషణకు ఈ మిషన్ ఆర్థిక ప్రోత్సాహకాలనూ అందిస్తుంది. తద్వారా ఖనిజాలకు సంబంధించి అధిక వ్యయం, వ్యర్థాల భారాన్ని తగ్గించేలా ప్రోత్సహిస్తుంది.

కీలక ఖనిజాలకు సంబంధించి విదేశీ ఆస్తులను సమకూర్చుకుని, ఆ వనరులు సమృద్ధంగా ఉన్న దేశాలతో వాణిజ్యాన్ని మెరుగుపరచుకునేలా దేశంలోని ప్రభుత్వ రంగ సంస్థలు, ప్రైవేటు కంపెనీలను ప్రోత్సహించడం ఈ మిషన్ లక్ష్యం. దేశంలో కీలక ఖనిజాల నిల్వ సదుపాయాలను పెంపొందించాలని కూడా ఇది ప్రతిపాదిస్తుంది.

కీలక ఖనిజాలకు సంబంధించి ప్రాసెసింగ్ పార్కుల ఏర్పాటుకు, వాటి పునర్వినియోగాన్ని ప్రోత్సహించేందుకు నిబంధనలు కూడా ఈ మిషన్ లో ఉన్నాయి. కీలక ఖనిజ సాంకేతికతలో పరిశోధనను ప్రోత్సహించడంతోపాటు అత్యున్నత కేంద్రాన్ని (సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్) ఏర్పాటు చేయాలని కూడా ఇది ప్రతిపాదిస్తుంది.

అన్ని ప్రభుత్వ సంస్థలనూ ఇందులో భాగం చేస్తూ.. సంబంధిత మంత్రిత్వ శాఖలు, ప్రభుత్వ రంగ సంస్థలు, ప్రైవేటు కంపెనీలు, పరిశోధన సంస్థలతో కలిసి పనిచేయడం ద్వారా ఈ మిషన్ లక్ష్యాలను సాధిస్తుంది.

1957 నాటి గనులు, ఖనిజాల (అభివృద్ధి, నియంత్రణ) చట్టాన్ని 2023లో సవరించి కీలక ఖనిజాల అన్వేషణ, వెలికితీతను పెంచారు. అనంతరం గనుల మంత్రిత్వ శాఖ వ్యూహాత్మక ఖనిజాలకు చెందిన 24 బ్లాకులను వేలం వేసింది. అంతేకాకుండా జియోలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా (జీఎస్ఐ) గత మూడేళ్లలో 368 కీలక ఖనిజాన్వేషణ ప్రాజెక్టులను చేపట్టింది. ప్రస్తుతం 2024-25లో 195 ప్రాజెక్టులు కొనసాగుతున్నాయి. 2025-26 ఆర్థిక సంవత్సరానికి, జీఎస్ఐ వివిధ కీలకమైన ఖనిజాల కోసం 227 ప్రాజెక్టులను చేపట్టబోతోంది. ఆవిష్కరణలను పెంపొందించడం కోసం 'సైన్స్ అండ్ టెక్నాలజీ అంకుర సంస్థలు, ఎంఎస్ఎంఈలలో పరిశోధన, ఆవిష్కరణలకు ప్రోత్సాహం (ఎస్ అండ్ టీ ప్రిజం) కార్యక్రమాన్ని సంబంధిత మంత్రిత్వ శాఖ 2023లో ప్రారంభించింది. తద్వారా అంకుర సంస్థలు, ఎంఎస్ఎంఈలకు నిధులందించి పరిశోధన - అభివృద్ధి అంశాల్లోను, వాణిజ్యీకరణలోనూ అంతరాలను తగ్గించడాన్ని లక్ష్యంగా పెట్టుకుంది. అంతేకాకుండా గనుల మంత్రిత్వ శాఖ జాయింట్ వెంచర్ అయిన కబిల్ అర్జెంటీనాలోని కాటమార్కా ప్రావిన్స్ లో లిథియం అన్వేషణ, వెలికితీత కోసం దాదాపు 15703 హెక్టార్ల విస్తీర్ణంలో స్థలాన్ని సమకూర్చుకుంది. ఇప్పటికే 2024-25 కేంద్ర బడ్జెట్ లో అనేక కీలకమైన ఖనిజాలపై కస్టమ్స్ సుంకాలను కేంద్ర ప్రభుత్వం తొలగించింది. దీనివల్ల దేశంలో కీలక ఖనిజాల లభ్యత పెరగడమే కాకుండా, దేశంలో ప్రాసెసింగ్ సదుపాయాల ఏర్పాటు దిశగా పరిశ్రమలకు ప్రోత్సాహం లభిస్తుంది. ఈ కార్యక్రమాలు కీలక ఖనిజాలను పొందడంపట్ల భారత నిబద్ధతను చాటుతాయి.

# బడ్జెట్ కోట్ మెరిల్ లైఫ్ సైన్సెస్‌లో కార్పొరేట్ స్ట్రాటజీ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ శ్రీ సంజీవ్ భట్..

న్యూఢిల్లీ, జనవరి 30:"ప్రపంచవ్యాప్తంగా వైద్య పరికరాల రంగం గణనీయమైన వృద్ధిని సాధించింది, రోగులకు మెరుగైన ఫలితాలు మరియు అవకాశాలను అభివృద్ధి చేయడం ద్వారా ఆధునిక ఆరోగ్య సంరక్షణకు మూలస్తంభంగా మారింది. భారతదేశంలో, 21వ శతాబ్దం మొదటి త్రైమాసికం పరివర్తన చెందింది, దేశాన్ని అధిక-నాణ్యత, సరసమైన వైద్య సాంకేతికతలకు ప్రపంచ కేంద్రంగా నిలిపింది.

ఈ పురోగతికి భారత ప్రభుత్వ ముందుచూపున్న కార్యక్రమాలు, ప్రొడక్షన్ లింక్డ్ ఇన్సెంటివ్ (ఖఐఎ) పథకం మరియు ఆరోగ్య సంరక్షణ మౌలిక సదుపాయాలపై బలమైన దృష్టి గణనీయంగా మద్దతు ఇచ్చాయి. ఈ చర్యలు మెడ్‌టెక్ తయారీలో ఆవిష్కరణ, పెట్టుబడులు మరియు స్వావలంబనను ప్రోత్సహించాయి. కేంద్ర బడ్జెట్ సమీపిస్తున్న కొద్దీ, ఈ ఊపును కొనసాగించడానికి ఖీడఆ, ఎగుమతులు మరియు పరిశ్రమ ఆధారిత ప్రోత్సాహకాలలో నిరంతర మద్దతు కోసం మేము ఎదురుచూస్తున్నాము.

మెరిల్ వద్ద , జీవితాలను మార్చే ప్రపంచ స్థాయి పరిష్కారాలను అందించడం ద్వారా భారతదేశం యొక్క మెడ్‌టెక్ అభివృద్ధికి దోహదం చేస్తుండటం పట్ల సంతోషంగా వున్నాము. ఆరోగ్యకరమైన భవిష్యత్తు కోసం ప్రపంచ ఆరోగ్య సంరక్షణ ఆవిష్కరణలలో నాయకుడిగా భారతదేశం యొక్క స్థానాన్ని ముందుకు తీసుకెళ్లడానికి మేము కట్టుబడి ఉన్నాము."

# బిషప్ కౌన్సిల్ తెలంగాణ రాష్ట్ర కోఆర్డినేటర్‌గా డాక్టర్ కొమ్ము ప్రవీణ్ కుమార్



మహబూబాబాద్ జనవరి 30 (ఎక్స్ ప్రెస్ న్యూస్ ); మహబూబాబాద్ జిల్లా కేంద్రం లోని బెతెలు ప్రార్థన మందిరం నందు బైబిల్ తీయాలజీ గ్రాడ్యుయేషన్ సమావేశం రెవరెండ్ యోహాను ఆధ్వర్యంలో జరిగింది. ఈ కార్యక్రమంలో మూడవ నంది అవార్డు గ్రహీత, ఖాఖ 10 రికార్డర్ విత్ గిన్నిస్ బుక్ రికార్డర్,జాతీయ అంతర్జాతీయ ఉత్తమ సేవా రత్న మరియు విద్య ,వైద్య అన్నదాత , ఆపద్బాంధవ అవార్డు గ్రహీత, 5వ.సారి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డ్ గ్రహీత బిషప్ డాక్టర్ కొమ్ము ప్రవీణ్ కుమార్ కు తెలంగాణ రాష్ట్ర బిషప్ కౌన్సిల్ నందు తెలంగాణ రాష్ట్ర కోఆర్డినేటర్ గా బాధ్యతలపై ప్రమాణస్వీకారం పత్రము అందించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్షుడ ఖీబి రెవరెండ్ డాక్టర్ విక్రమ్ పాల్ గారు మరియు ఉ.వా.బిషప్ మాల్సూర్ నాయక్ , ఏ.వా.బిషప్ ఉ.ఎ.ఏసుపాదం , మహబూబాబాద్ జిల్లా అధ్యక్షులు బిషప్ ఉ.ఎ.ఇజ్రాయిల్ ,బిషప్ డేవిడ్ తాళ్లూరి రత్న ప్రభు మరియు ఇతర రాష్ట్రాల దైవజనులు, పాస్టర్లు మరియు బైబిల్ కాలేజ్ విద్యార్థులు పాల్గొన్నారు.

# కోడ్ నిబంధనలు పాటించేలా చర్యలు తీసుకోవాలి....

## -తహసీల్దార్ కార్యాలయం లో పిర్యాదు.

కరీంనగర్, జనవరి 30:: (నేటినిజం ప్రతినిధి) తిమ్మాపూర్ మండలం లోని రాజకీయ పార్టీలకు



సంబందించిన కోడ్ ఉల్లంఘన విషయంలో నిబంధనలు పాటించేలా చర్యలు తీసుకోవాలని తిమ్మాపూర్ బీజేపీ నాయకులు గురువారం తహసీల్దార్ కార్యాలయంలో పిర్యాదు చేసారు.

మండలంలోని రాజీవ్ రహదారి వెంట ఉన్నటువంటి రాజకీయ పార్టీల ఫ్లెక్సీ లను, హోర్డింగ్ లను, గోడ రాతలను తొలగించాలని అలాగే స్థానిక ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయం వద్ద కమాన్ పై పార్టీ గుర్తులతో ఉన్న స్టిక్కర్ లను కూడా తొలగించాలని పిర్యాదు లో కోరారు. కోడ్ ఉల్లంఘన నిబంధనలు పాటించేలా వివిధ రాజకీయ పార్టీలకు నాయకులకు అవగాహనా కార్యక్రమాలను నిర్వహించాలని కోరారు. తహసీల్దార్ అందుబాటులో లేకపోవడంతో ఇన్వార్డ్ సెక్షన్ లో పిర్యాదు సమర్పించారు. బీజేపీ అధ్యక్షులు సుగుర్తి జగదీశ్వరాచారి,కిసాన్ మోర్చా జిల్లా ఉపాధ్యక్షులు బోనాల మోహన్,బీజేవైఎం అధ్యక్షులు గడ్డం అరుణ్,ఓబీసీ మోర్చా అధ్యక్షులు దుర్సెట్టి రమేష్,మండల కార్యదర్శి సునీల్ రెడ్డి, అందె శేఖర్, బుడిగె మహేష్,ఉప్పులేటి ప్రవీణ్ తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

# కలెక్టర్ చే జాహత్ బేగ్‌కు కమెండేషన్ అవార్డు ప్రదానం

హైదరాబాద్ జనవరి 30 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ హైదరాబాద్ జిల్లా బ్రాంచ్ ప్యాట్రన్ మెంబర్ నుజాహత్ బేగ్‌కు కలెక్టరేట్‌లో హైదరాబాద్ జిల్లా కలెక్టర్ అనుదీప్ దూరిశెట్టి చేతుల మీదుగా ప్రశంసా పురస్కారాన్ని అందజేశారు. రెడ్‌క్రాస్ హైదరాబాద్ జిల్లా శాఖకు తాను చేసిన సేవలకు గుర్తింపుగా ఈ అవార్డును అందుకోవడం ఎంతో సంతోషంగా ఉందని, భవిష్యత్తులోనూ ఆమె అన్నారు. ఆమె రెడ్‌క్రాస్ సేవా కార్యక్రమాలను హైదరాబాద్ జిల్లా నలుమూలలకు విస్తరించింది మరియు పేదలకు సేవలు అందిస్తుంది. ఈ అవార్డును అందుకున్న హైదరా బాద్ జిల్లా బ్రాంచ్ ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ చైర్మన్ మామిడి భీమ్ రెడ్డికి ఆమె ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

# ఉపాధ్యాయులు విద్యార్థులకు మార్గ నిర్దేశనం చేయాలి


## -జిల్లా విద్యాధికారి జగన్మోహన్ రెడ్డి

రాజన్న సిరిసిల్ల, జనవరి 28:(నేటినిజం ప్రతినిధి): ఉ



పాధ్యాయులు విద్యార్థులకు చదువుతో పాటుగా, ఉన్నత లక్ష్యాలను చేరేలా మార్గనిర్దేశం చేయాలని జిల్లా విద్యాధికారి జగన్మోహన్ రెడ్డి పేర్కొన్నారు. ఉపాధ్యాయులకు కౌన్సిలింగ్, మార్గదర్శకత్వంపై జిల్లాస్థాయి శిక్షణ కార్యక్రమాన్ని వేములవాడ పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో గురువారం నిర్వహించారు. రెండు రోజుల శిక్షణలో భాగంగా మొదటి రోజు ఆయన హాజరై మాట్లాడుతూ విద్యార్థులు చదువు సక్రమంగా కొనసాగించడంలో ఏర్పడుతున్న అవరోధాలను అధిగమించేలా ఉపాధ్యాయులు కృషి చేయాలని ఆయన సూచించారు. పదో తరగతి పరీక్షలకు హాజరయ్యే ప్రతి విద్యార్థి పై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. వారి భవిష్యత్తుకు అనుగుణంగా వివిధ కోర్సుల పై దిశా నిర్దేశం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సెక్టోరియల్ అధికారిని శైలజ, మండల విద్యాధికారి బన్నాజీ, ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు రాజారత్నం, ఆర్ పి లు, జిల్లాలోని ఉన్నత పాఠశాలకు చెందిన ఒక ఉపాధ్యాయులు, సీఆర్పీలు పాల్గొన్నారు.

# ఇచ్చిన హామీలను నెరవేర్చాలని మహాత్మా గాంధీ కి వినతి పత్రం ఇచ్చిన టీఆర్ఎస్ నాయకులు



మహబూబాబాద్, జనవరి 30: (నేటినిజం ప్రతినిధి): కాంగ్రెస్ పార్టీ సీఎం రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఏర్పడి 420 రోజులు పూర్తయిన ప్రజలకు ఇచ్చిన హామీలను ఏ ఒక్కటి కూడా నెరవేర్చలేదని పెద్దవంగర బిఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు అధ్యక్షుడు ఈదురు ఐలయ్య అన్నారు. రాష్ట్ర బిఆర్ఎస్ పార్టీ వర్కింగ్ అధ్యక్షుడు కేటీఆర్ పిలుపుతో మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు ఆదేశాల మేరకు వడ్డేకొత్తపల్లి గ్రామంలో మహాత్మా గాంధీ గారి విగ్రహానికి కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ముందు ఇచ్చిన హామీల పత్రాలను మహాత్మా గాంధీ గారి విగ్రహానికి సమర్పించి కాంగ్రెస్ నాయకులకు సీఎం రేవంత్ లకు బుద్ధి చెప్పి హామీలను నెరవేర్చమని వినతి పత్రాన్ని ఇవ్వటం జరిగింది. రైతు భరోసా పథకం 15 వేలు ఇస్తామని చెప్పి 12 వేలకు కుదించడం, నిరుద్యోగులకు ఏడాదికి 2 లక్షల ఉద్యోగాలని, ఆసరా పింఛన్లు 2 వేలకు 4 వేలని, 4 వేలకు 6 వేలని 6 గ్యారంటీల పేరుతో ప్రజలను మోసం చేసి అధికారంలోకి వచ్చి ప్రజలను మోసం చేయడంతో కాంగ్రెస్ నాయకులకు బుద్ధి చెప్పాలని గాంధీ విగ్రహాన్ని కోరడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ ప్రధాన కార్యదర్శి శ్రీరాం సంజయ్, మండల బిఆర్ఎస్ నాయకులు శ్రీరాం సుధీర్, రాసాల సమ్మయ్య, దంతాలపల్లి సాయిలు, చింతల భాస్కర్,వేముల రఘు, గుగులోతు పటేల్ నాయక్, పసులేటి వెంకటరామయ్య, గ్రామ పార్టీ అధ్యక్షులు కేశబోయిన కుమారస్వామి,రెడ్డబోయిన గంగాధర్, నాయకులు మెుర్రిగాడుదుల శ్రీనివాస్,మండల ఎస్సి సెల్ అధ్యక్షుడు చిలుక భిక్షపతి,మండల యూత్ నాయకులు కూతురు అనుదీప్,బొల్లు సతీష్,దేశెట్టి మహేష్ తదితరులు పాల్గొన్నారు.

# అమెరికాలో ట్రక్కు ఢీకొని హైదరాబాదీ విద్యార్థి మృతి


న్యూయార్క్, జనవరి 30: హైదరాబాద్‌కు చెందిన 28 ఏళ్ల మొహమ్మద్ వాజిద్. అమెరికాలో జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతిచెందాడు. మసాచుసెట్స్‌లోని ప్లైమౌత్ కౌంటీలో జనవరి 28వ తేదీన ఆ ప్రమాదం జరిగింది. హైదరాబాద్‌లోని ఖైరతాబాద్ అతని స్వస్థలం. అమెరికాలోని ఎన్ఆర్ఐ మైనార్టీ కాంగ్రెస్ కమిటీ సభ్యుడు అతను. చికాగోలో అతను మాస్టర్స్ డిగ్రీ పూర్తి చేశాడు.

వాజిద్ సెమీ ట్రక్కు డ్రైవ్ చేస్తున్న సమయంలో ప్రమాదం జరిగింది. క్రాసింగ్ స్టాప్ సైన్ వద్ద ఆగకుండా అతని ట్రక్కు దూసుకెళ్లింది. ఆ వేగంతోనే మరో ట్రక్కును ఢీకొట్టింది. వాజిద్ వాహనం నుజ్జునుజ్జు అయ్యింది. ఆస్పత్రికి తీసుకెళ్లినా.. వాజిద్ మృతిచెందినట్లు తేల్చారు. మరో ట్రక్కు నడిపిస్తున్న డ్రైవర్ తిమోతీ విల్కిన్ క్షేమంగా ఉన్నాడు.

ప్రమాద సమయంలో స్వల్పంగా మంటలు వ్యాపించాయి. తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డితో వాజిద్ దిగిన ఫోటోను తెలంగాణ కాంగ్రెస్ కార్యదర్శి షాహబుద్దీన్ తన ట్విట్టర్‌లో పోస్టు చేశారు.

# ప్రజాపాలన పేరుకే పరిమితమైంది

## -బిఆర్ఎస్ సీనియర్ నాయకులు నిమ్మశెట్టి విజయ్



రాజన్న సిరిసిల్ల, జనవరి 28:(నేటినిజం ప్రతినిధి): ప్రజాపాలన పేరుకే పరితమైందని, ఏ ఒక్కరికి సంక్షేమ పథకాలు అందడం లేదని బీఆర్ఎస్ నాయకులు నిమ్మశెట్టి విజయ్ అన్నారు. మహాత్మా గాంధీ వర్ధంతి సందర్భంగా రాష్ట్ర బిఆర్ఎస్ పార్టీ పిలుపుమేరకు వేములవాడ పట్టణంలోని గాంధీనగర్లో గాంధీ విగ్రహానికి వినతిపత్రం ఇచ్చి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్నికల్లో ఇచ్చిన 420 హామీలు వెంటనే అమలు అమలు చేయాలని కాంగ్రెస్ పార్టీ ఆబద్దాలతో అధికారంలోకి వచ్చి 420 రోజులైంది కానీ 4 పథకాలు కూడా అమలు కాలేదన్నారు అధికారంలోకి వచ్చిన 100 రోజుల్లో అమలు చేస్తామన్న ఆరు గ్యారెంటీలో ఏ ఒక్క గ్యారెంటి సంపూర్ణంగా అమలు చేయలేదని విజయ్ అన్నారు. అలాగే రైతులకు రైతు భరోసా 15000లు ఇస్తామని 120000లు ఇస్తామని చెప్పడమే కానీ కానీసం ఆ 6000లు కూడా ఇవ్వకుండా రైతులని ఇబ్బందికి గురి చేస్తున్నారని అన్నారు. మొన్నటికి మొన్న 4 గ్యారంటీల అమలు అనీ లిస్ట్ లో పేర్లు చెప్పి రేషన్ కార్డు,ఇందిరమ్మ ఇండ్లు,ఇందిరమ్మ ఆత్మియ భరోసా,రైతు భరోసా అంటూ ప్రజలను గారడి చేశారే తప్ప ఏక్కడ వాటిని అమలు చేయలేదన్నారు. దరఖాస్తుల పేరిటా ప్రజలను ఆశల పల్లకీలో ఉంచి ఎన్నికల్లో లబ్ధి పొందాలని చూస్తున్నారనీ అన్నారు. తెలంగాణ రాష్ట్రంలో ఏ ఒక్క పథకం అమలు చేయకుండా,ప్రాజెక్ట్ లు కట్టకుండా ఈ 14 నెలల వ్యవధిలోనే ఒక లక్ష 40,000 కోట్ల అప్పు చేసిన పార్టీ కాంగ్రెస్ పార్టీ అని అన్నారు. కెసిఆర్ ఆనవాళ్లను లేకుండా చేస్తామని ముఖ్యమంత్రి చెపుతున్నారని ఆనవాళు అంటే రైతు బంధు,రుణమాఫి,24 గంటల కరెంటు,దళితబంధు,బిసి బంధు కళ్యాణ లక్ష్మి లాంటి పథకాలను ప్రజలకు అందించకుండా చేసి రాక్షస ఆనందం పొందుతున్నారని అన్నారు. కాంగ్రెస్ పాలనను ప్రజలందరూ గమనిస్తున్నారని రానున్న రోజుల్లో గ్రామ పంచాయితి,ఎంపిటిసి,జెడ్పిటిసి,మున్సిపల్ ఎన్నికల్లో ప్రజలు కాంగ్రెస్ పార్టీకి ఓటుతో బుద్ధి చెప్తారని అన్నారు.. ఈ కార్యక్రమంలో నాయకులు నరాల శేఖర్, గోలి మహేష్,జోగిని శంకర్,బత్తుల దేవరాజు,కొండ కనకయ్య,మిర్యాల సంతోష్,గజ్జెల రమేష్,సంతోష్ యాదవ్, సయ్యద్ ఉమర్, మంతె సందీప్, రవిచంద్ర, హరీష్, రాకేష్, సాయిక్రిష్ణ, దేవరాజ్, సంజీవ్ తదితరులు పాల్గొన్నారు.

| ఫిబ్రవరి | నేటినిజం | | | 2025 |
|---|---|---|---|---|
| ఆది వారం | | 2 | 9 | 16 | 23 |
| సోమ వారం | | 3 | 10 | 17 | 24 |
| మంగళ వారం | | 4 | 11 | 18 | 25 |
| బుధ వారం | | 5 | 12 | 19 | 26 |
| గురు వారం | | 6 | 13 | 20 | 27 |
| శుక్ర వారం | | 7 | 14 | 21 | 28 |
| శని వారం | 1 | 8 | 15 | 22 | |

# యువ భారత్ జోరు సాగని..! రేపు ఇంగ్లాండ్‌ను ఢీకొట్టనున్న టీమిండియా..!

న్యూఢిల్లీ, జనవరి 30: మలేషియా వేదికగా జరుగుతున్న అండర్-19 వుమెన్స్ టీ20 ప్రపంచకప్‌లో సెమీఫైనల్‌లో భాగంగా టీమిండియా ఇంగ్లాండ్‌తో జనవరి 31న తలపడనున్నది. ఐసీసీ టోర్నీలో ఇప్పటి వరకు టీమిండియా వరుస విజయాలతో సెమీ ఫైనల్ వరకు చేరింది. ఇక కీలకమైన సెమీస్‌లోనూ నిక్కీ ప్రసాద్ నేతృత్వంలోని యువ భారత్ జోరును కొనసాగిస్తే ఫైనల్‌కు చేరుకోనున్నది. గ్రూప్ దశలో వెస్టిండిస్, మలేషియా, శ్రీలంకపై వరుస విజయాలను నమోదు చేసి సూపర్ సిక్స్‌కు చేరింది. సూపర్ సిక్స్ దశలో తొలి మ్యాచ్‌లో ఎనిమిది వికెట్ల తేడాతో, రెండో మ్యాచ్‌లో స్కాట్లాండ్ జట్టుపై 150 పరుగుల తేడాతో భారీ విజయాన్ని నమోదు చేసింది.

సూపర్ సిక్స్ దశలో స్కాట్లాండ్‌తో జరిగిన మ్యాచ్‌లో తెలంగాణ అమ్మాయి త్రిష గొంగడి అద్భుత బ్యాటింగ్‌తో అలరించింది. అండర్-19 టీ20 వరల్డ్ కప్ చరిత్రలో తొలిసారిగా సెంచరీ చేసిన బ్యాటర్‌గా చరిత్ర లిఖించింది. స్కాట్లాండ్ జట్టుపై 59 బంతుల్లోనే 10 పరుగులు చేసింది. ఇందులో 13 ఫోర్లు, నాలుగు సిక్సర్లు ఉన్నాయి. ఈ మ్యాచ్‌లో కేవలం 53 బంతుల్లోనే అజేయ సెంచరీ చేసింది. స్కాట్లాండ్‌తో మ్యాచ్‌లో మరో ఓపెనర్ జీ కమలినీ సైతం 42 బంతుల్లో 51 పరుగులతో రాణించింది. టోర్నీలోని ఐదు మ్యాచుల్లో త్రిష 76.66 సగటుతో 230 పరుగులు చేసింది. ఇంగ్లాండ్ బ్యాట్స్‌వుమెన్స్ దేవినా పెర్రిన్ 131 పరుగులతో రెండో స్థానంలో ఉంది. స్కాట్లాండ్‌తో మ్యాచ్‌లో భారత్ బౌలర్లు అద్భుత ప్రదర్శన చేసి 58 పరుగులకే ఆలౌట్ చేశారు. ఈ మ్యాచ్‌లు ఆయుషి శుక్లా ఎనిమిది పరుగులు ఇచ్చి నాలుగు వికెట్ల పడగొట్టింది. వైష్ణవి శర్మ ఐదు పరుగులు ఇచ్చి మూడు వికెట్లు, గొంగడి త్రిష ఆరు పరుగులు ఇచ్చి మూడు వికెట్ల చేసింది.

వైష్ణవి ఇప్పటి వరకు 12 వికెట్ల పడగొట్టగా.. ఆయుషి పది వికెట్ల తీసింది.భారత జట్టు : నిక్కీ ప్రసాద్ (కెప్టెన్), సానికా చల్కే, జీ త్రిష, జీ కమలిని, భావికా అహిరే, ఈశ్వరి అవసరే, మిథిలా వినోద్, జోషితా వీజే, సోనమ్ యాదవ్, పరుణికా సిసోడియా, కేసరి ధృతి, ఆయుషి శుక్లా, ఆనందిత కిషోర్, వైష్ణన్, ఎండీ షబ్నం.ఇంగ్లాండ్ జట్టు : అబి నార్గ్రోవ్ నార్గ్రోవ్ (కెప్టెన్), ఫోబ్ బ్రెట్, ఒలివియా బ్రిస్డెన్, టిల్లీ కోర్టీన్ కోల్‌మన్, ట్రూడీ జాన్సన్, కేటీ జోన్స్, షార్లెట్ లాంబర్ట్, ఈవ్ ఓనీల్, దేవినా పెర్రిన్, జెమిమా స్పెన్స్, షార్లెట్ స్టబ్స్, అమృతా సురెన్‌కుమార్, ప్రిషా థానవాలా, ఎరిన్ థామస్, గ్రా థానవాలా.

# నాగోబ జాతరకు పోటెత్తిన జనం

ఆదిలాబాద్, జనవరి 30:ఆదిలాబాద్ జిల్లా ఇంద్రవెల్లి మండలం కేస్లాపూర్‌లో జరుగుతున్న నాగోబ జాతరకు గురువారం భారీ సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. తెలుగు రాష్ట్రాలతో పాటు మహారాష్ట్ర, ఒడిశా, మధ్యప్రదేశ్ రాష్ట్రాల నుంచి గిరిజనులు నాగోబాను దర్శించుకున్నారు. మెస్రమం వంశానికి చెందిన గిరిజనులు పెద్దదేవునికీ, మహిళలు బాన్ దేవత పూజలు నిర్వహించారు. జాతర ప్రారంభమైన రెండో రోజు భారీగా భక్తులు తరలిరావడంతో అధికారులు ఇబ్బందులు కలగకుండా ఏర్పాట్లు చేశారు. శుక్రవారం జరిగే గిరిజన దర్బార్ కు రాష్ట్ర మంత్రులు సీతక్క కొండా సురేఖ హాజరుకానున్నట్లు అధికారులు తెలిపారు.

Printed, Published and owned by VEENADAS, at Freedom Publications, SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500 020, Telangana.
Published at SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500020. Telangana.'Editor: **BAISA DEVADAS.**
RNI No.52865/93.
E-mail :netinijam93@gmail.com.